నేటి కందం-నేటికి అందం

గొప్పగ కామన్ వెల్తున
మెప్పును బొందంగ మనము మించిన ధృతిలో
ముప్పది తొమ్మిది పతకము
లప్పణముగ నందుకొంటి మానందముతోన్ !!
(కామన్ వెల్త్ క్రీడల్లో మన భారత క్రీడాకారులు అమేయ ప్రతిభను చూపించి ముప్పై తొమ్మిది పతకాలను వివిధ క్రీడల్లో గెలిచి మన భారత దేశ ప్రతిష్ఠను ప్రపంచానికి వివరించారు.)
-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

చురక

జెన్ జీ ఉద్యమాల
జబర్దస్తు షాకులు
బేజేపి కంచుకోట
బంకీపుర్ క్రాకులు.
ఉపఎన్నిక ఓటమొక
ఉదాహరణ మాత్రమే
అధికారం అణచివేస్తే
అంతానికి సూత్రమే
-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్  బుధవారం 5-8-2026  NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33  సంచిక : 2  పేజీలు:6  వెల: రూ.1/-

## విద్య, వైద్య రంగాలకు పెద్దపీట..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి



ములుగు, ఆగష్టు 4: (నేటినిజం ప్రతినిధి) ఉమ్మడి వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి సీతక్క నూతన సదరం శిబిరం, యూడీఐడీ భవనం, ఆక్సిజన్ ప్లాంట్‌తో పాటు ఆర్థో, గైనిక్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ విభాగాలకు సంబంధించిన నాలుగు ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లా కేంద్రంలో ప్రత్యేక డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. జిల్లా ఆస్పత్రి ప్రస్తుత భవనం ఇరుకుగా ఉన్న నేపథ్యంలో మరో ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగుపడటం సంతోషకరమైన విషయమని, ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను మంత్రి పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి చంద్రశేఖర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉధృతంగా పొంగిపొర్లుతున్న వాగులు

ములుగు, ఆగష్టు 4: (నేటినిజం ప్రతినిధి) మండలంలో రాత్రి కురిసిన భారీ వర్షాలతో పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సంతాయిపేట భీమేశ్వర వాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోందని గ్రామ సర్పంచ్ భాస్కర్ రెడ్డి తెలిపారు.

రైతులు వంట పొలాలకు వెళ్లే సమయంలో వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని, పశువుల కాపరులు కూడా పశువులను వాగు దాటించవద్దని ఆయన హెచ్చరించారు. వాగు ఉధృతి తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కాళోజివాడి గ్రామ సమీపంలోని వంతెన వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా గ్రామం నుంచి బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వాగుపై వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించి వాగుపై శాశ్వత వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చొరవ తీసుకోవాలని గ్రామ సర్పంచ్ చంద్రారెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు కోరారు.

ప్రస్తుతం వాగు ఉధృతి అధికంగా ఉన్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి ప్రజల భద్రత కోసం తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## వరంగల్ ఉమ్మడి జిల్లాల వైద్య సేవలపై సమీక్ష..

-మెరుగైన సదుపాయాలపై మంత్రి దామోదర ఆదేశాలు
-మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల పనితీరుపై సమగ్ర పరిశీలన



హైదరాబాద్, ఆగష్టు 4:వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య సేవలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. మంగళవారం సచివాలయంలో ఆయా జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కే.ఆర్. నాగరాజు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, డీఎంహెచ్‌వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలో భాగంగా జనగామ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి, నర్సంపేట మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజీలోని సౌకర్యాలు, ఎంజీఎం ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతిని మంత్రి పరిశీలించారు.

మూడు జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల అభివృద్ధి, అవసరమైన వైద్య సిబ్బంది నియామకం, వైద్య పరికరాల లభ్యత, పెండింగ్ అభివృద్ధి పనులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండేలా మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి పూర్తి ప్రాధాన్యం: మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్, ఆగస్టు 4: మత్స్యకారుల సంక్షేమంపై మంత్రి వాకిటి శ్రీహరి కీలక సమావేశం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో చర్చలు జరిపారు. 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకు మత్స్యకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై సమావేశంలో చర్చించారు.

పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మధ్యాహ్న భోజనంలో చేపలను చేర్చే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. సభ్యత్వ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో చేపల విక్రయాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దోహదం చేస్తుందని చెప్పుకొచ్చారు.

రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## ఐడీ ప్రూఫ్ అడిగినందుకు హోటల్ సిబ్బందిపై కర్రలతో దాడి..

హైదరాబాద్, ఆగస్టు 4: నగరంలోని సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి కొందరు యువకులు వీరంగం సృష్టించారు. ఐడీ ప్రూఫ్ అడిగినందుకు హోటల్ సిబ్బందిపై నలుగురు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనలో ఆకాశ్ అనే క్లీనింగ్ స్టాఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. భరత్‌నగర్‌లోని ఓ హోటల్‌కు అర్ధరాత్రి నలుగురు వ్యక్తులు వచ్చారు. రూమ్ ఇవ్వాలని కోరగా.. హోటల్ సిబ్బంది ఐడీ ప్రూఫ్ అడిగారు. 'మేము లోకల్.. ఐడీ ఎందుకు' అంటూ సదరు వ్యక్తులు వాగ్వాదానికి దిగారు. ఆధార్ కార్డు అడగడంతో మొదలైన గొడవ తీవ్ర ఘర్షణకు దారి తీసింది.

రూమ్ బుకింగ్ కోసం వచ్చిన వ్యక్తులు కర్రలతో హోటల్ సిబ్బందిపై దాడికి తెగబడ్డారు. దీంతో క్లీనింగ్ స్టాఫ్ ఆకాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సహచరులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ వ్యవహారంపై సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో హోటల్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. హోటల్‌లో సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. నలుగురు వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ఇంటర్నెట్: మంత్రి శ్రీధర్ బాబు..

హైదరాబాద్, ఆగష్టు 4:తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు.

ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ (౧-ూచింబె) నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు.

అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

## ఎన్.ఆర్.ఐ. కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రవాస భారతీయులు ఘన స్వాగతం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 4: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్ నగరానికి చేరుకున్నారు. డల్లాస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు ఎన్ఆర్ఐ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు.

తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా పుష్పగుచ్ఛాలు అందించి, ఆత్మీయంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డల్లాస్ విమానాశ్రయం వద్ద కొంతసేపు సందడి నెలకొంది.

ఈ సందర్భంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌కు చేరుకున్న తనకు ఆత్మీయ స్వాగతం పలికిన ఎన్ఆర్ఐ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రవాస భారతీయులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విదేశాల్లో ఉన్నప్పటికీ తెలంగాణతో, దేశంతో అనుబంధాన్ని కొనసాగిస్తూ చూపుతున్న ఆప్యాయత తనను ఎంతో ఆనందానికి గురిచేసిందని పేర్కొన్నారు.

అమెరికా పర్యటన సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న భట్టి విక్రమార్క, తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలు, పారిశ్రామికాభివృద్ధి, రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రవాస భారతీయులతో సమావేశమయ్యే అవకాశమున్నట్లు సమాచారం.

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలపై అమెరికాలోని వివిధ వేదికల్లో ఆయన చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి.

డల్లాస్‌లో ఘన స్వాగతంతో ప్రారంభమైన భట్టి విక్రమార్క అమెరికా పర్యటనపై ప్రవాస తెలంగాణవాసుల్లో ఆసక్తి నెలకొంది.

## ఇంద్రకీలాద్రిపై భక్తిశ్రద్ధలతో ఆషాఢ మాస సారె సమర్పణ..



అమరావతి, ఆగష్టు 4: విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కేశఖండనశాల నాయి బ్రాహ్మణ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆషాఢ మాస సారె కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. సీనా నాయక్ దంపతులు, ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యుల సమక్షంలో అమ్మవారికి సారె సమర్పించారు. కేశఖండనశాల నాయి బ్రాహ్మణ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఆలయాల జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు, ఏ.జీ.ఎల్. నారాయణ, ఆర్.వి. రమణ, జి. హరికిరణ్, ఎ. పూర్ణ కనకారావు, పి. సంతోష్, ఎ. రాంబాబు, ఆర్. రమణ, జి. సంతోష్, కె. కిషోర్, కె. సిద్ధయ్య, వై. సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిపారవశ్య వాతావరణంలో ఘనంగా జరిగింది.

## ఇజ్రాయెల్‌కున్న గొప్ప స్నేహితుల్లో మోదీ ఒకరు: బెంజమిన్ నెతన్యాహు

న్యూ ఢిల్లీ, ఆగష్టు 4:భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. తనకున్న అత్యంత సన్నిహిత మిత్రుల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒకరు అని, భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు

ప్రపంచ వేదికపై ఇజ్రాయెల్‌కు బలమైన మద్దతు అందిస్తున్న దేశాల్లో భారత్ కీలకమైనదని నెతన్యాహు చెప్పారు. ఇజ్రాయెల్ ఒంటరిగా ఉందనే ప్రచారం వాస్తవం కాదని నెతన్యాహు స్పష్టం చేశారు. భారత్‌తో పాటు పలు దేశాలతో ఇజ్రాయెల్ దౌత్య, ఆర్థిక, సాంకేతిక, భద్రతా రంగాల్లో సహకారం పెరుగుతోందని చెప్పారు. ఇక, భారత్‌లో ఇజ్రాయెల్‌కు లభిస్తున్న ఆదరణ ఎంతో విలువైనదని ఆయన అన్నారు భారత్-ఇజ్రాయెల్ మధ్య రక్షణ, వ్యవసాయం, సాంకేతికత, సైబర్ భద్రత, ఆవిష్కరణలు వంటి అనేక రంగాల్లో ఇప్పటికే బలమైన భాగస్వామ్యం కొనసాగుతోంది (ఔవబిజీనిఎజీష్ట్రబీ ఎనిటతిజీ). ఇటీవలి కాలంలో ఇరు దేశాల నాయకుల మధ్య సన్నిహిత సంబంధాలు మరింత బలపడటంతో వ్యూహాత్మక సహకారం కూడా వేగంగా విస్తరిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ, ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లి పలు కీలక ఒప్పందాలు చేసుకున్న సంగతి తెలిసిందే.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరప్రతాలు ఆవిష్కరణ



ఖమ్మం, ఆగష్టు 4: ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ ప్రతి గూడెంలో ఆదివాసి జెండా ఎగురవేయాలన్నారు. జాతి ఐక్యతను చాటాలని, తమ జాతి హక్కులను, చట్టాలను రక్షించడానికి బలమైన ఉద్యమం నిర్మించే దిశగా యువత అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున ప్రతి ఒక్క ఆదివాసి జిల్లా ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంలో నిర్వహించే భారీ సాంస్కృతిక ర్యాలీకి హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు తెల్లం రామారావు దొర, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు గడ్డం వెంకటేశ్వరరావు, ఆదివాసి యువ నాయకుడు కాకా రమేశ్ పాల్గొన్నారు.

# చందమామపై కాలుమోపిన తొలి వ్యోమగామి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్

## (05 ఆగష్టు "వ్యోమగామి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జన్మదినం" సందర్భంగా)

చంద్రమండలంపై కాలుమోపిన మొదటి వ్యోమగామి(ఆస్ట్రనాట్)గా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అంతరిక్ష చరిత్రలో చెరగని అరుదైన రికార్డును నెలకొల్పాడు. 05 ఆగష్టు 1930న ఓహియా నగరంలో జన్మించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ పర్డ్యూ యూనివర్సిటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ డిగ్రీని పూర్తి చేసి, సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఇంజనీకరింగ్ విభాగంలో పిజీ కూడా పూర్తి చేసారు. 1949 - 50 మధ్య కాలంలో నావల్ ఏవియేటర్‌గా, నేషనల్ అడ్వైజరీ కమిటీ ఫర్ ఏరోనాటిక్స్, నాసా(నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ ఆర్గనైజేషన్)లలో చేరిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్17 ఏండ్ల పాటు ఇంజనీర్‌గా సేవలు అందించారు. నాసాలో ప్రాజెక్ట్ పైలెట్‌గా దాదాపు 200 రకాల ఏయిర్‌క్రాఫ్ట్‌లు, జెట్స్, రాకెట్లు, హెలీకాప్టర్లు, గ్లైడర్స్‌ల్లో వైమానికుడిగా బహుముఖీన ప్రతిభను ప్రదర్శించారు. 1962లో ఆస్ట్రోనాట్‌గా "జెమిని-8 మిషన్''లో భాగంగా 1966లో అంతరిక్షయానం విజయవంతంగా పూర్తి చేశారు. అంతరిక్షంలో నెలకొన్న తీవ్ర వాతారణాన్ని తట్టుకుంటూ మానసికంగా దృఢ విశ్వాసంతో చంద్రమండల ప్రయాణం పూర్తి చేసిన ఆర్మ్‌స్ట్రాంగ్ చూపిన సాహస స్ఫూర్తి నేటి తరానికి ప్రేరణగా నిలుస్తున్నది.

### బహుముఖ ప్రజ్ఞాశాలి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ :

నావల్ ఏవియేటర్, టెస్ట్ పైలెట్, యూనివర్సిటీ ప్రొఫెసర్, ఏరోనాటికల్ ఇంజనీర్ లాంటి పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ "అపోలో-11 ల్యూనార్ మాడ్యూల్" ప్రాజెక్ట్‌లో స్పేస్‌క్రాఫ్ట్ కమాండర్‌గా తొలి మానవసహిత చంద్రమండల ప్రయాణానికి నాయకుడిగా సిద్ధం అయ్యారు. 16 జూలై 1969 రోజున నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌తో పాటు పైలెట్ బజ్ ఆల్డ్రిన్, మైఖేల్ కోలిన్స్‌లతో కలిసి చంద్రమండల ప్రయాణానికి ప్రారంభం అయ్యారు. 2.4 లక్షల మైళ్లు ప్రయాణించి 20 జూలై 1969న చంద్రమండలానికి చేరుకున్నారు. అదే రోజు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వ్యోమనౌక లోంచా బయటకు వచ్చి చందమామ ఉపరితలంపై తొలిసారి కాలుమోపి, రెండున్నర గంటల పాటు చంద్రుడిపై బజ్ ఆల్డ్రిన్‌తో కలిసి సంచరించాడు. వ్యోమనౌకలో ఉన్న మైఖేల్ కాలిన్స్ కక్షలో మాత్రమే పరిభ్రమించాడు. అంతరిక్ష చరిత్రలో మొదటి మానవుడిగా రికార్డును నెలకొల్పారు. ఈ అంతరిక్ష మిషన్‌లో మొత్తంగా 8 రోజులు, 14 గంటలు, 12 నిమిషాలు అంతరిక్షంలో గడిపారు. చందమామ ఉపరితలంపై కాలుమోపిన మరు క్షణమే భావోద్వేగాలకు గురి అయిన ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ "చందమామ పై వేసిన ఓ చిన్న తొలి అడుగు, రేపటి మానవాళి అంతరిక్ష చరిత్రలో ఓ భారీ ముందడుగు" అంటూ పేర్కొన్నారు.

### అంతరిక్ష రంగంలో చెరగని ముద్ర:

16వ ఏట 1947లో నావల్ ఏయిర్ కెడెట్‌గా, 1971 - 79 మధ్య కాలంలో సిన్సినాటీ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్యుడిగా, 1982 - 92 మధ్య కంప్యూటింగ్ టెక్నాలజీ ఫర్ ఏవియోషన్ విభాగానికి చైర్మన్‌గా ఆర్మ్‌స్ట్రాంగ్ సేవలు అందించారు. పలు ఏవియోషన్ సంఘాల్లో సభ్యుడిగా లేదా చైర్మన్‌గా పలు హోదాల్లో పని చేశారు. తన జీవితకాలంలో 17కు పైగా యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు పొంది పలు పురస్కారాలు స్వీకరించారు. ప్రెసిటెంట్స్ మెడల్, ఏవియేషన్ పురస్కారాలు, రాబర్ట్ ట్రోఫీలను అందుకున్నారు. 25 ఆగష్టు 2012న తన 82వ ఏట అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఆదర్శమయ జీవితం ఏరోనాటికల్ ఇంజనీర్స్, వ్యోమగాములకు దారి దీపంగా వెలుగులు చిమ్ముతూనే ఉన్నారు.

అద్భుత ధైర్యానికి మారుపేరుగా నిలిచిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జీవితం ఆసాంతం అంతరిక్ష శాస్త్రానికే అంకితం, నేటి ఆస్ట్రొనాట్స్‌కే ఆయన సాహసం ఆదర్శప్రాయం.



-మధుపాళీ
9949700037

# వాణిజ్య బొగ్గు తవ్వకం: స్వయం-సమృద్ధ భారత్ దిశగా భారత ప్రయాణానికి ఊతం

న్యూఢిల్లీ, ఆగష్టు 3:భారత ఇంధన అవసరాల్లో అధిక భాగాన్ని బొగ్గు తీరుస్తోంది. దేశ ప్రాథమిక ఇంధన అవసరాల్లో ఇది దాదాపు 55 శాతం వాటాను కలిగి ఉంది. ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో 70 శాతానికి పైగా బొగ్గు ద్వారానే జరుగుతోంది. సుమారు 4,00,715 మిలియన్ టన్నుల (ఎమ్‌టీ) నిల్వలతో, ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద బొగ్గు నిల్వలను భారత్ కలిగి ఉంది. బొగ్గు ఉత్పత్తి, వినియోగంలో రెండో అతిపెద్ద దేశంగా నిలిచింది. 350కి పైగా గనుల్లో సుమారు ఐదు లక్షల మంది గని కార్మికులు ఈ బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారు.

2014-15 ఆర్థిక సంవత్సరంలో దేశీయ బొగ్గు ఉత్పత్తి 609.18 మెట్రిక్ టన్నులుగా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇది 1047.52 మెట్రిక్ టన్నులకు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1040.08 మెట్రిక్ టన్నులకు పెరిగింది. వరుసగా రెండు సంవత్సరాలు బిలియన్ టన్నులను దాటింది. ఈ వృద్ధిలో గణనీయ భాగం క్యాప్టివ్, వాణిజ్య బ్లాక్‌లదే. జాతీయ ఉత్పత్తిలో వీటి వాటా 2021-22 ఆర్థిక సంవత్సరంలో 10.9 శాతంగా ఉంది. ఇది 2025-26 ఆర్థిక సంవత్సరంలో 20.2 శాతానికి పెరిగింది.

స్థిరమైన, నిష్పాక్షికమైన ప్రమాణాలు లేనందున ఈ ప్రక్రియ ఏకపక్షంగా ఉందని పేర్కొంటూ... 1993-2012 మధ్య కేటాయించిన 218 బ్లాకుల్లో 204 బ్లాకులను భారత సుప్రీం కోర్టు 2014లో రద్దు చేసింది. పారదర్శకమైన, వేలం ఆధారిత విధానం ఆవశ్యకతనూ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

దీనికి ప్రతిస్పందనగా, బొగ్గు గనుల (ప్రత్యేక నిబంధనలు) చట్టం-2015 గనులను తిరిగి కేటాయించడం కోసం పటిష్ఠమైన, చట్టబద్ధమైన ఆధారాన్ని కల్పించింది. మొదటి విడత వేలం ప్రక్రియను డిసెంబర్ 2014లో ప్రారంభించారు. 2015-2020 మధ్య కాలంలో పది విడతల్లో వేలం నిర్వహించి, తొమ్మిది కేటాయింపులు చేయడం ద్వారా 76 బొగ్గు గనులను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత, స్వయం-సమృద్ధ భారత్ మిషన్ ఆధ్వర్యంలో... 18 జూన్ 2020న వాణిజ్య బొగ్గు తవ్వకం లాంఛనంగా ప్రారంభమైంది. ఇది పోటీ ప్రాతిపదికన బొగ్గు అమ్మకానికి అనుమతినిస్తూ, ప్రభుత్వ రంగానికే పరిమితం కాకుండా ప్రైవేటు భాగస్వామ్యాన్నీ విస్తరించింది. విజయవంతమైన బిడ్డర్ ఇప్పుడు ఏ రంగంలోని ఏ వినియోగదారులకైనా మార్కెట్ నిర్ణయించిన ధరలకు బొగ్గును అమ్మవచ్చు. ఈ విషయంలో సొంత వినియోగంపై గానీ, బొగ్గును ఎలా వినియోగించాలనే దానిపై గానీ ఎలాంటి ఆంక్షలూ లేవు.

గతంలో ప్రతి టన్నుకు లెక్కించే స్థిర రుసుము స్థానంలో... ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాబడిలో కొంత శాతాన్ని బిడ్డర్ కోట్ చేసే రాబడి-భాగస్వామ్య నమూనాను ప్రవేశపెట్టారు. ఆ వాటాను జాతీయ బొగ్గు సూచీకి అనుసంధానిస్తారు. తద్వారా బొగ్గు వాస్తవ విలువతో పాటే దేశానికి వచ్చే రాబడీ పెరుగుతుంది. అర్హతా నిబంధనలనూ గణనీయంగా విస్తరించారు. ఇకపై మునుపటి మైనింగ్ అనుభవం అవసరం లేదు. జాయింట్ వెంచర్లూ, కన్సార్టియంలూ దీనిలో పాల్గొనవచ్చు. ఆటోమేటిక్ మార్గం ద్వారా 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులనూ అనుమతిస్తారు.

జూన్ 2020 నుంచి, 14 విడతల్లో 141 బొగ్గు గనులను వాణిజ్యపరంగా వేలం వేశారు. వీటి మొత్తం గరిష్ఠ వార్షిక సామర్థ్యం 366.35 మెట్రిక్ టన్నులు. సగటు రాబడి వాటా 24.17 శాతం. ఇది 4 శాతం కనిష్ఠ స్థాయి కంటే ఆరు రెట్లు ఎక్కువ. వీటిలో, 123 గనులు ప్రైవేట్ సంస్థలకు దక్కగా, విజయం సాధించిన బిడ్డర్లలో 44 సంస్థలు గతంలో ఎప్పుడూ బొగ్గు తవ్వకం జరపనివే.

2025-26 ఆర్థిక సంవత్సరంలో క్యాప్టివ్, వాణిజ్య బ్లాక్‌లు కలిసి సుమారు 210.46 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించి, తొలిసారిగా 200 మిలియన్ టన్నుల మార్కును దాటాయి. ఒక దశాబ్దం కిందట ఈ సంఖ్య 28.83 మిలియన్ టన్నులుగా ఉండేది. ఇది ఆ కాలంలో సుమారు 22 శాతం కౌంపౌండ్ వార్షిక వృద్ధి (సీఏజీఆర్)ని సూచిస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య గనులు సుమారు 26.12 మిలియన్ టన్నుల ఉత్పత్తిని అందించాయి. వీటిలో 23 గనులు (గని ప్రారంభ అనుమతిని పొందినవి) కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరిగినప్పుడు... ఇప్పటివరకు వేలం వేసిన బ్లాక్‌లు సుమారు రూ. 47,000 కోట్ల వార్షిక ఆదాయాన్ని, సుమారు రూ. 48,756 కోట్ల మూలధన వ్యయాన్ని ఆర్జించడం సహా సుమారు 4,75,000 మందికి ఉపాధిని కల్పిస్తాయని అంచనా.

ఖజానాకు వచ్చే రాబడులూ అదే స్థాయిలో పెరిగాయి. ప్రీమియం జనరేషన్ ద్వారా వచ్చే ఆదాయం 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ. 461 కోట్లుగా ఉంది. ఇది 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 5,553 కోట్లకు పెరిగింది. ఇది సుమారు 26 శాతం కాంపౌండ్ వార్షిక వృద్ధిని (సీఏజీఆర్) నమోదు చేసింది. ఖజానాకు, ఉత్పత్తి చేసే రాష్ట్రాలకూ ఈ ఆదాయం సమకూరింది.

వేలం వేసిన ప్రతి గనిని ఉత్పత్తిలోకి తీసుకురావడంపై ప్రస్తుతం దృష్టి సారించారు. వ్యాపార సౌలభ్యం కోసం నిరంతర ప్రయత్నాల ద్వారా, బ్లాక్‌ల కార్యాచరణకు అవసరమైన అనుమతుల భారాన్ని తగ్గించారు. ఈ వ్యవస్థను మరింత సరళీకరించారు. తద్వారా నిర్దేశిత కార్యాచరణ కాలపరిమితులు గణనీయంగా తగ్గాయి. పూర్తిగా అన్వేషించిన బ్లాక్‌ల కోసం 51 నెలల నుంచి 40 నెలలకు, పాక్షికంగా అన్వేషించిన వాటికి 66 నెలల నుంచి 52 నెలలకు కాలపరిమితులు తగ్గాయి. (ప్రస్తుతం కొనసాగుతున్న 15వ విడత నుంచి ఇది అమలులోకి వస్తుంది).

జూన్ 2020 నుంచి ప్రతి వాణిజ్య బొగ్గు బ్లాక్‌ను బహిరంగ వేలం ద్వారానే కేటాయిస్తున్నారు. ఈ సంస్కరణలు పారదర్శకత, పోటీ, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల మధ్య సమాన అవకాశాల కల్పనపై ఆధారపడి ఉన్నాయి. ఇవి దేశ ఇంధన భద్రతను బలోపేతం చేస్తాయి.

విద్యుత్, ఉక్కు పరిశ్రమలకు మద్దతునిస్తాయి. స్వయం-సమృద్ధ భారత్ లక్ష్యం దిశగా దేశాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తాయి.

# వాహనాల మధ్య సమాచార వ్యవస్థ

న్యూ ఢిల్లీ, ఆగష్టు 3:మోటారు వాహనాల మధ్య (వీ2వీ) సమాచార వ్యవస్థలను దశలవారీగా అమలు చేయడానికి కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు 1989కి సవరణలు ప్రతిపాదిస్తూ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా ప్రకటనను విడుదల చేసింది.

వాహనాల మధ్య, ఇతర సాంకేతిక ఆధారిత రవాణా వ్యవస్థ అప్లికేషన్ల కోసం 5.875 గిగాహెర్ట్జ్ నుంచి 5.925 గిగాహెర్ట్జ్ బ్యాండ్ విడ్త్ ఫ్రీక్వెన్సీని పరిశీలించారు. టెలికమ్యూనికేషన్ల విభాగం 10 జూన్ 2026 నాటి జీ.ఎస్.ఆర్ 466 (ఈ) ద్వారా ఈ ఫ్రీక్వెన్సీ పరిధి వినియోగానికి సంబంధించిన లైసెన్సింగ్ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చింది.

సమీపంలోని వాహనాలు వాటి వేగం, స్థానం, ప్రయాణ దిశ, యాక్సిలరేషన్ మొదలైన తక్షణ వివరాలను ఒకదానితో ఒకటి ఇచ్చిపుచ్చుకునేందుకు ఈ కమ్యూనికేషన్ వ్యవస్థ సహాయపడుతుంది.

అకస్మాత్తుగా బ్రేక్ వేయడం, ముందున్న వాహనాన్ని ఢీకొట్టే ప్రమాదం, సురక్షితం కాని రీతిలో లైన్ మారడం, అత్యవసర వాహనాలు సమీపానికి రావడం వంటి భద్రతా పరమైన కీలక పరిస్థితుల్లో ఈ సమాచారం డ్రైవర్లకు లేదా వాహన వ్యవస్థలకు ముందస్తు హెచ్చరికలను అందిస్తుంది.

# దేశవ్యాప్తంగా పీఎం-అజయ్ ఆదర్శ గ్రామ విభాగం కింద 47,328 గ్రామాల ఎంపిక

న్యూఢిల్లీ, ఆగష్టు 3: 'ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన' (పీఎం-అజయ్) ఆదర్శ గ్రామ విభాగం కింద ఆయా గ్రామాల సమగ్ర అభివృద్ధి ద్వారా షెడ్యూల్డ్ కులాల సామాజిక-ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా భారత ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానించి, కీలకమైన అభివృద్ధి అంతరాలను పరిష్కరించడం ద్వారా ముఖ్య సామాజిక-ఆర్థిక సూచికల్లో సంతృప్త స్థాయిని నిర్ధారించడం ఈ పథకం లక్ష్యం.

సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి శ్రీ రామ్‌దాస్ అథవాలే రాజ్యసభలో శ్రీ అనిల్ కుమార్ యాదవ్ మందాడికి లిఖితపూర్వకంగా ఈ వివరాలను తెలిపారు. పీఎం-అజయ్ పథకంలోని ఆదర్శ గ్రామ విభాగం కింద దేశవ్యాప్తంగా 47,328 గ్రామాలను ఎంపిక చేయగా, ఇందులో తెలంగాణలోని 435 గ్రామాలూ ఉన్నాయని కేంద్ర మంత్రి సభకు తెలియజేశారు. రాష్ట్రాల వారీగా ఎంపికైన గ్రామాల వివరాలను సభ ముందు ఉంచారు.

లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర మంత్రి ఈ సమాచారాన్ని పేర్కొన్నారు: ఆదర్శ గ్రామ విభాగం... విద్య సహా 10 రంగాల్లో పర్యవేక్షించదగిన 50 సామాజిక-ఆర్థిక సూచికలను సమగ్రపరచడం ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో సమీకృత అభివృద్ధిపై దృష్టి సారిస్తుంది. ఈ సూచికల ప్రాథమిక స్థితిని నిర్ధారించడానికి అవసరాల అంచనా కోసం సర్వే నిర్వహిస్తారు. గుర్తించిన సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో సమన్వయం ద్వారా లేదా పీఎం-అజయ్ కింద మద్దతునిచ్చే చర్యల ద్వారా పరిష్కరిస్తారు.

రాష్ట్రాలు సాధించిన పురోగతిని పీఎంఏజీవై పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారు.

ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 3,28,131 అభివృద్ధి పనులను, 1,10,51,213 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు సభకు తెలియజేశారు. వీటిలో 46,642 అభివృద్ధి పనులు పూర్తి కాగా, ఇప్పటివరకు 47,59,399 మంది లబ్ధిదారులు లబ్ధి పొందారు.

తెలంగాణకు సంబంధించి, విద్యా రంగం కింద 3,529 మంది లబ్ధిదారులను గుర్తించగా, వారిలో 472 మంది లబ్ధిదారులు ఇప్పటికే ఈ పథకం కింద లబ్ధి పొందారని లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

థర్డ్-పార్టీ ఆడిట్‌కు సంబంధించిన ప్రశ్నకు సమాధానమిస్తూ, పీఎం-అజయ్ ఆదర్శ గ్రామ విభాగం కింద ఆదర్శ గ్రామ స్వీయ-ప్రకటనను ధ్రువీకరించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర మంత్రి సభకు తెలియజేశారు.

# రాష్ట్రపతితో భేటీ అయిన ఉజ్బెకిస్థాన్ విదేశీ వ్యవహారాల మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 3:ఈ రోజు (2026 ఆగష్టు 3) రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ముతో ఉజ్బెకిస్థాన్ రిపబ్లిక్ విదేశీ వ్యవహారాల మంత్రి సైదోవ్ బక్తియెూర్ ఒదిలోవిచ్ సమావేశమయ్యారు.

రాష్ట్రపతి భవన్‌కు విచ్చేసిన ఒదిలోవిచ్‌కూ, ఆయన ప్రతినిధి బృందానికి రాష్ట్రపతి స్వాగతం పలికారు. ప్రాచీన వాణిజ్య మార్గాల ఆధారంగా ఏర్పడిన బలమైన చారిత్రక, సాంస్కృతిక, నాగరిక సంబంధాలను భారత్, ఉజ్బెకిస్థాన్ పంచుకుంటున్నాయన్నారు. ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని వాస్తు కళ, భాష, ఆహారం, సంగీతం, మత సంప్రదాయాల్లో ఉన్న ఉమ్మడి వారసత్వం మరింత బలోపేతం చేస్తోందన్నారు.

రెండు దేశాల వ్యాపార సంస్థలకు ఒకరి మార్కెట్లపై మరొకరికి పెరుగుతున్న విశ్వాసాన్ని- ఉజ్బెక్ ప్రతినిధి బృందంలో ఉన్నత స్థాయి నాయకుల భాగస్వామ్యం, పర్యటన సందర్భంగా నిర్వహించిన భారత్?ఉజ్బెకిస్థాన్ బిజినెస్ ఫోరం ప్రతిబింబిస్తున్నదని రాష్ట్రపతి అన్నారు. మైనింగ్ రంగంలో ముఖ్యంగా అరుదైన ఖనిజాలు, వ్యవసాయం, ఫార్మాసూటికల్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య సహకారానికి ఉన్న అపారమైన అవకాశాల గురించి వివరించారు.

మన ఐటీఈసీ శిక్షణ కోర్సులు, ఇతర ఉపకారవేతన కార్యక్రమాల ద్వారా ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 3,000 మందికి పైగా అధికారులు, నిపుణులు, విద్యార్థులు ప్రయోజనం పొందినందుకు రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఉజ్బెకిస్థాన్‌లో 16,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వారు రెండు దేశాల మధ్య స్నేహానికి ప్రతీకగా నిలుస్తూ పరస్పర అవగాహనను, బలమైన ప్రజా సంబంధాలను పెంపొందిస్తున్నారని రాష్ట్రపతి అన్నారు. ఈ పర్యటన సందర్భంగా చేపట్టిన చర్చలు రెండు దేశాల మధ్య ఉన్న స్నేహసంబంధాలనూ, విశ్వాసాన్నీ, సహకారాన్నీ మరింత బలోపేతం చేస్తాయని నాయకులిద్దరూ అంగీకరించారు.

# డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

## అనుమానాస్పద సమాచారం వెంటనే పోలీసులకు అందించాలి: ఎస్పీ మహేష్ బి. గితే



ఆదిలాబాద్, ఆగష్టు 3:జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వాటికి సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు.

మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆర్ఎస్ఐ (అడ్మిన్) ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలం సహాయంతో ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, బస్టాండ్, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, కొనుగోలు, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, బస్టాండ్లు, ప్రజా రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో నార్కోటిక్ జాగిలాల సహాయంతో తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని పేర్కొంటూ, వాటి దుష్పరిణామాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు లేదా సమీప పోలీసు అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# అడవి పందులను తరలిస్తున్న బొలెరో పట్టివేత..



ఆదిలాబాద్, ఆగష్టు 3:బాసర గోదావరి వద్ద ఉన్న అటవీశాఖ చెక్‌పోస్ట్‌లో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో అడవి పందులను అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనాన్ని అటవీశాఖ అధికారులు పట్టుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి సిద్దిపేటకు సుమారు 23 అడవి పందులను బొలెరో వాహనంలో తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు వాహనంతో పాటు ఇద్దరినీ భైంసా అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి ఎం. శంకర్ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న అడవి పందులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వాటిని అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఫారెస్ట్ బీట్ అధికారులు శివ, సంజయ్, చెక్‌పోస్ట్ వాచర్లు సద్దాం, నరేంద్ర, అనిమల్ ట్రాకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.




# బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం రెండో సమావేశానికి ఆతిథ్యమిస్తున్న భారత్

న్యూఢిల్లీ, ఆగష్టు 3:బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం (ఏసీడబ్ల్యూజీ) రెండో సమావేశానికీ, ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశానికీ భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిబ్బంది, శిక్షణ విభాగం (డీవోపీటీ) ఆతిథ్య మివ్వనుంది. బ్రిక్స్-2026కు భారత్ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో 2026 ఆగస్టు 4, 5 తేదీల్లో తెలంగాణలోని హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది.

భారత్ అధ్యక్షత వహిస్తున్న బ్రిక్స్ ఇతివృత్తమైన 'స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' స్ఫూర్తిగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమాన్ని సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ప్రారంభిస్తారు. బ్రిక్స్ సభ్యదేశాల ప్రతినిధులతో పాటుగా సీనియర్ విధాన రూపకర్తలు, నిపుణులు, ప్రాక్టీషనర్లు, అవినీతి నిరోధక, లా ఎన్ఫోర్స్‌మెంట్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.

2026 జూన్ 2,3 తేదీల్లో వర్చువల్‌గా జరిగిన బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం మొదటి సమావేశం ఫలితాల ఆధారంగా హైదరాబాద్ సమావేశం జరుగుతోంది. ఆస్తుల రికవరీ, సీమాంతర అవినీతిని ఎదుర్కోవడం, పాలనలో పారదర్శకతనూ, జవాబుదారీతనాన్నీ పెంపొందించడంలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడంపై బ్రిక్స్ సభ్యదేశాలు చర్చిస్తాయి.

దిగువ పేర్కొన్న అంశాల ద్వారా ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించడంపై చర్చలు దృష్టి సారిస్తాయి:

అవినీతి కేసుల్లో పరారీలో ఉన్న నేరస్తుల ఆచూకీని గుర్తించడానికీ, అప్పగింత ప్రక్రియలకు మద్దతు ఇవ్వడానికీ అనధికారిక సహకారాన్ని బలోపేతం చేయడం.

ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్వర్క్ ద్వారా సమాచారాన్ని పంచుకోవడాన్నీ, కార్యాచరణ సహకారాన్నీ విస్తరించడం.

ఫిన్‌టెక్, డిజిటల్ ఆస్తులు, అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక సాధనాల నుంచి ఉత్పన్నమయ్యే అవినీతి సంబంధిత ప్రమాదాలను నివారించడంలో, ఎదుర్కోవడంలో అనుభవాలనూ, ఉత్తమ పద్ధతులనూ పంచుకోవడం.

"ఆవిష్కరణ, సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన" అనే అంశంపై 2026 ఆగస్టు 5న ఓ ప్రత్యేక అనుబంధ కార్యక్రమం కూడా నిర్వహిస్తారు. డిజిటల్ ప్రభుత్వ కొనుగోళ్ల వ్యవస్థ, పౌర భాగస్వామ్యం, పారదర్శకత, జవాబుదారీతనం, పరిపాలనలో నిజాయతీని బలోపేతం చేయడానికి ఆవిష్కరణాత్మక విధానాలతో సహా సాంకేతిక ఆధారిత పరిపాలనపై తమ అనుభవాలను పంచుకోవడానికి బ్రిక్స్ సభ్యులకు వేదికగా ఈ అనుబంధ కార్యక్రమం నిలుస్తుంది.

చర్చలు, అనుభవాలను పంచుకోవడం, సహకార కార్యక్రమాల ద్వారా బ్రిక్స్ దేశాల మధ్య ఆచరణాత్మక సహకారాన్ని ప్రోత్సహించాలనే భారత్ చిత్తశుద్ధిని హైదరాబాద్ సమావేశం తెలియజేస్తోంది. బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న భారత్ నేతృత్వంలో జరిగే చివరి సమావేశం కావడంతో ఈ అవినీతి నిరోధక కార్యాచరణ బృంద సమావేశం ఈ ఏడాదిలో సాధించిన పురోగతిని పటిష్ఠం చేస్తుందని భావిస్తున్నారు. అలాగే ఆస్తుల రికవరీ, సీమాంతర అవినీతిని నిరోధించడం, సాంకేతిక ఆధారిత పరిపాలన, సంస్థాగత సామర్థ్య నిర్మాణంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య స్థిరమైన సహకారానికి పునాది వేస్తుందని అంచనా వేస్తున్నారు.

# ద్విచక్ర వాహన అంబులెన్సులు

న్యూఢిల్లీ, ఆగష్టు 3:ద్విచక్ర వాహన అంబులెన్సులకు నియంత్రణపూర్వక ప్రాథమిక ప్రణాళికను రూపొందించడానికి 'కేంద్ర మోటారు వాహనాల చట్టం-1989'లో సవరణలను ప్రతిపాదిస్తూ, ఓ ముసాయిదా ప్రకటనను రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ జారీ చేసింది.

గ్రామీణ, మారుమూల, పర్వత ప్రాంతాల్లో త్వరితగతిన అత్యవసర సేవలను అందించడంతో పాటు చికిత్స సంబంధిత సేవలను అందించడంలో ద్విచక్ర వాహన అంబులెన్సులు తోడ్పడతాయి.

కేంద్ర మోటారు వాహనాల నియమావళిలో భాగంగా ప్రస్తుతం ఈ ద్విచక్ర అంబులెన్సులను ఓ ప్రత్యేక తరగతిగా పరిగణించడం లేదు. ఫలితంగా, ఈ కేటగిరీలకు సంబంధించి వీటి తయారీ, నిర్వహణ, క్షతగాత్రుడి తరలింపు వ్యవస్థలు, వాటి ఆమోదం, నమోదు, ఫిట్‌నెస్ వంటి తనిఖీలకు సంబంధించిన జాతీయ ఆవశ్యకతలేవీ లేవు. ప్రతిపాదించిన సవరణలు ఈ లోటును.. ఏఐఎస్-209 (ఒకటో భాగం):2026-ప్రాణ రక్షక ద్విచక్ర అంబులెన్సుల తయారీ, నిర్వహణ ఆవశ్యకతలను ఆమోదించడం ద్వారా తీరుస్తాయి.

వర్తించే తీరు: 2027 అక్టోబరు 1 న, లేదా ఆ తేదీ తరువాత తయారు చేసిన ఎల్2 కేటగిరీకి చెందిన ద్వి చక్ర వాహన అంబులెన్సులను ఏఐఎస్ -209 (ఒకటో భాగం): 2026 కు అనుగుణంగా ఉండాలని ప్రతిపాదించారు. అత్యవసర టాప్ లైట్లు: ద్విచక్ర వాహన అంబులెన్సులకు అమర్చే టాప్ లైట్లు 2027 అక్టోబరు 1 నుంచి ఏఐఎస్ -209 (ఒకటో భాగం):2026 కు అనుగుణంగా ఉండాలని ప్రతిపాదించారు.

నిర్వహణ ప్రాంతం: ఇలాంటి అంబులెన్సులను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధారించిన ప్రాంతాలలో నడపడానికి నమోదు చేసుకోవచ్చు.

ఫిట్‌నెస్ ఆవశ్యకత: ద్విచక్ర వాహన అంబులెన్సులను రవాణా వాహనాలుగా పరిగణిస్తారు. ఇవి ఫిట్‌నెస్ ఆవశ్యకతలకు లోబడి ఉంటాయి. వీటి ఫిట్‌నెస్ ధ్రువపత్రాలను ప్రతి రెండు సంవత్సరాలకు నవీనీకరించుకోవలసి ఉంటుంది.

ప్రత్యేక తనిఖీ ఏర్పాట్లు: అంబులెన్సు సహాయక ఉపకరణాలు లేదా రోగి రవాణా యూనిటును భద్రంగా అమర్చడం, టైర్లు, రిమ్ములు, అత్యవసర హెచ్చరిక లైట్లు, పేషెంట్ స్ట్రెచరు, దానికి తాళమేసే ఏర్పాటు, రోగిని సురక్షితం చేసేం దుకు ఉద్దేశించిన వ్యవస్థ లు, లోడింగు, అన్‌లోడింగు వ్యవస్థలు, అగ్నినిరోధక యం త్రం లభ్య త, చెల్లుబాటు వంటి అంశాలు ఫిట్‌నెస్ తనిఖీ పరిధి లోకి వస్తాయి. భద్రత, నిర్వహణ నిబంధనలు: ద్విచక్ర వాహన అంబులెన్సును ఎల్2-కేటగిరీ వాహనంగా ఏఐఎస్-209 (ఒకటో భాగం): 2026 నిర్వచిస్తోంది. ఎల్2-కేటగిరీ వాహనంలో.. అంబులెన్సు సహాయక యూనిట్టుగాని, లేదా రోగిని రవాణా చేసేందుకు తగిన వ్యవస్థనుగాని జతచేస్తారు. ఈ ప్రమాణం కీలక నిర్మాణ, విధుల సంబంధిత జాగ్రత్త చర్యలతో కూడి ఉంటుంది. ఈ చర్యలలో.. వాహన స్థిరత్వం, బ్రేకింగ్ సామర్థ్యం, పార్కింగ్ బ్రేకు, గ్రేడింగుకు సంబంధించిన అవసరాలు, వెనుక ఏమి ఉన్నదీ చూపించే ఏర్పాటు, కప్లింగ్ తాలూకు సమగ్రత, అత్యవసర విజిబులిటీ, హెచ్చరిక సాధనాలు, అంబులెన్సు లోపల రోగిని సురక్షితంగా ఉంచి తీసుకువెళ్లడం, పర్యావరణ పరంగా ఎదురయ్యే చిక్కుల నుంచి సంరక్షణకు తోడ్పడే వ్యవస్థలు కలిసి ఉంటాయి.

ద్వి చక్ర వాహన అంబులెన్సుల డిజైను, నిర్వహణలో మరింత భద్రతనీ, బాధ్యతనీ ప్రతిపాదిత ఫ్రేమ్‌వర్క్ అందిస్తు ందని భావిస్తున్నారు. ఇది రాకపోకల పరంగాగాని, లభ్యత పరంగా గానీ సాంప్రదాయిక అంబులెన్సు సమస్యలను ఎదుర్కోవలసి వచ్చే చోట్ల, సత్వర అత్యవసర ప్రతిస్పం దనను అందించడంతో పాటు అత్యవసర చికిత్స సేవలను మెరుగుపరుస్తుంది.

# డీడీయూ-జీకేయూకు చెందిన ఆరుగురికి భారత దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం

న్యూఢిల్లీ, ఆగష్టు 3: గ్రామీణ నైపుణ్యాభివృద్ధి తీసుకొస్తున్న పరివర్తనాత్మక ప్రభావాన్ని గుర్తిస్తూ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూ?జీకేవై) యువ లబ్ధిదారులు ఆరుగురుకి 2026 ఆగస్టు 15న న్యూఢిల్లీలో జరిగే భారత దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథులుగా ఆహ్వానం లభించింది. వీరంతా పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, మిజోరాం, నాగాలాండ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకూ, రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ఆతిథ్యమిచ్చే ప్రతిష్ఠాత్మక 'ఎట్ హోం' విందుకూ హాజరయ్యేందుకు అధికారిక ఆహ్వాన పత్రాలను... ఎంపికయిన యువ లబ్ధిదారులు ఇండియా పోస్ట్ ద్వారా అందుకున్నారు. ఇది వ్యక్తిగత విజయాలకు లభించిన గుర్తింపు మాత్రమే కాదు. ఇది నైపుణ్యాలు, స్థిరమైన జీవనోపాధి, గౌరవప్రదమైన ఉపాధి ద్వారా డీడీయూ?జీకేవై సాధించిన పరివర్తనకు జాతీయ స్థాయిలో లభించిన గుర్తింపు కూడా.

ఎంపికయిన వారు ఎర్రకోటలో జరిగే జాతీయ వేడుకలను వీక్షిస్తారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగే విందుకు హాజరవుతారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక జాతీయ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యం.. గ్రామీణ నైపుణ్య వ్యవస్థకూ, డీడీయూ?జీకేవై ద్వారా యువ విజేతలుగా నిలిచిన వారికి గర్వకారణంగా నిలుస్తుంది.

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన ? జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (డీఏవై?ఎన్ఆర్ఎల్ఎం) పరిధిలో ఉపాధి కల్పనతో అనుసంధానమై ఉన్న కార్యక్రమమే డీడీయూ?జీకేవై. పరిశ్రమలకు తగిన నైపుణ్యాలను, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సర్టిఫికేషన్లను, సుస్థిరమైన, గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలను ఈ కార్యక్రమం గ్రామీణ పేద యువతకు అందిస్తుంది.

డీడీయూ-జీకేవై ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది గ్రామీణ యువతకు దీర్ఘకాలిక జీవనోపాధి అవకాశాలు లభించాయి. ఈ కార్యక్రమం ఆర్థిక సాధికారతనూ, స్వావలంబననూ సాధించేలా చేసి, భారత దేశ వృద్ధి ప్రయాణంలో చురుకైన భాగస్వాములుగా వారిని మార్చింది.

నైపుణ్యంతో కూడిన శ్రామిక శక్తిని సృష్టించడంలో, స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహించడంలో ఈ పథకం సాధించిన విజయానికి ఈ ఆరుగురు లబ్ధిదారులకు అందిన ఆహ్వానం జాతీయ గుర్తింపుగా నిలుస్తోంది. ఉపాధి కల్పనకు మాత్రమే పరిమితం కాకుండా.. నైపుణ్యాభివృద్ధి ద్వారా గ్రామీణ యువతకు గౌరవప్రదమైన కెరీర్లు, ఆర్థిక స్వాతంత్ర్యం, మరింత సురక్షితమైన భవిష్యత్తు లభిస్తుందని ఈ విజయం తెలియజేస్తోంది.

ఎంపికయిన లబ్ధిదారుల పట్టుదల, కృషితో పాటు సంబంధిత రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎస్ఆర్ఎల్ఎం)లు, ప్రాజెక్టు అమలు సంస్థ (పీఐఏ)లు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చేపట్టిన సమష్టి ప్రయత్నాలను ఈ విజయం ప్రతిబింబిస్తుంది.

దేశవ్యాప్తంగా లక్షలాది మంది గ్రామీణ యువతకు ఈ గౌరవం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. అదేవిధంగా నైపుణ్యాలు అవకాశాలను సృష్టిసాయనీ, సుస్థిర జీవనోపాధి స్వావలంబనను అందిస్తుందనీ, సాధికారత సాధించిన యువత దేశ వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందనే దార్శనికతను ఈ గౌరవం మరింత బలోపేతం చేస్తుంది.

# వైభవంగా ముగిసిన శ్రీ ఆందోల్ మైసమ్మ బోనాల మహోత్సవాలు



నల్గొండ, ఆగష్టు 4: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపురం గ్రామ సమీపంలో వెలసిన శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయంలో 21వ బోనాల ఉత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఈ నెల 1న ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.

ముగింపు ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక గణపతి పూజ, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహక అధికారి సల్వాది మోహన్ బాబు మాట్లాడుతూ, ఈ ఏడాది బోనాల ఉత్సవాలను భక్తుల సహకారంతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది, గ్రామస్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయం చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి, సంతోషిమాత దేవాలయ ఈవో అలుగుబెల్లి సత్తిరెడ్డి, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్, ధర్మకర్తల మండలి సభ్యులు ఈడుదుల బాబు, బేతాళ నరసింహ, సిద్ధిపేట ఆనందరెడ్డి, వెంకిర్యాల శివ, బాలగోని శ్రీకాంత్ గౌడ్, బొంతల యువరాజ్, మన్నే మహేందర్ రెడ్డి, దౌడీ రాజేష్ పన్నాల, మహేందర్ రెడ్డి, ధేప రాజీవ్, పంతంగి రమేష్, జొన్నగంటి దాసు, చిట్టెంపల్లి సబిత, అర్చకులు వల్లూరి శివప్రసాద్ శర్మతో పాటు గ్రామ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శిథిలావస్థలోని ఇళ్లలో నివసించవద్దు: మున్సిపల్ చైర్మన్

కరీంనగర్, ఆగష్టు 3:వర్షాకాలం నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ నివసించవద్దని మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య ప్రజలకు సూచించారు. మంగళవారం 21వ వార్డులో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న ఇళ్లతో పాటు ఖాళీ స్థలాలను తనిఖీ చేసి, వర్షాల కారణంగా పాత భవనాలు కూలిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అలాగే ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నీరు నిలిచే ప్రాంతాల్లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ వేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య చర్యలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామ్మోహన్ రెడ్డి, పులిపాక రాజు, జవాన్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసిన కాళోజీ హెల్త్ యూనివర్సిటీ

ములుగు, ఆగష్టు 4: (నేటినిజం ప్రతినిధి)తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో 2026?-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ , బీడీఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా (కన్వీనర్ కోటా) సీట్లలో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఔఇఖ జఉ-?2026లో క్వాలిఫై అయిన విద్యార్థులు ఆగస్టు 5 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 12 సాయంత్రం 6 గంటల వరకు https://tsmedadm.tsche.inని వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్ ఆప్షన్లకు ముందు ప్రత్యేకంగా ప్రకటిస్తామని పేర్కొంది.

అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ముందు ప్రాస్పెక్టస్‌ను పూర్తిగా చదివి, అర్హతలు, రిజర్వేషన్లు, అవసరమైన ధ్రువపత్రాలు, నిబంధనలను పరిశీలించి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది. పూర్తి వివరాలు, సమాచారం కోసం www.knruhs.telangana.gov.in ని వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరింది.

**విద్యార్థులకు ముఖ్యమైన సూచనలు**

ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్లను తప్పకుండా అప్‌లోడ్ చేయాలి.

నమోదు ప్రక్రియ ఒక్కసారి మాత్రమే ఉంటుంది. ప్రతి రౌండ్ కౌన్సెలింగ్‌కు మళ్లీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు.

సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేస్తారు.

అనంతరం వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్, సీట్ల మ్యాట్రిక్స్‌ను KNRUHS వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.

వెబ్ ఆప్షన్లు ఇచ్చేటప్పుడు కళాశాలల ప్రాధాన్యత క్రమాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది.

# నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో అర్ధరాత్రి దోపిడీ

నిజామాబాద్, ఆగష్టు 4:నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి అనంతరం తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి యజమాని అర్ధరాత్రి సమయంలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి వచ్చేసరికి దొంగతనం జరిగినట్లుగా సంబంధిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మూడో టౌన్ ఎస్ఐ హరిబాబు కథనం ప్రకారం.. నిజాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన సాయి అనే వ్యక్తి సోమవారం రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి రైల్వే స్టేషన్ వద్ద టీ తాగేందుకు వెళ్లాడు.

తిరిగి గంట తర్వాత ఒకటింటికి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి, ఇంట్లోని వస్తువులన్నీ చిందరమందరంగా ఉండడంతో రెండు గంటల సమయంలో తనకు ఫోన్ చేశాడు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మూడు తులాల బంగారం దొంగతనం జరిగినట్లు బాధితుడు వెల్లడించాడు. ఘటనా స్థలాన్ని నగర సీఐ శ్రీనివాస్ రాజ్ పరిశీలించి క్లూస్ టీం తో ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లుగా ఎస్ఐ హరిబాబు వెల్లడించారు.

# ఐఐటీ ఢిల్లీలో హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఎక్సలెన్స్ సెంటర్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 4:ఐఐటీ ఢిల్లీలో హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఎక్సలెన్స్ సెంటర్ (సీవోఈహెచ్‌టీ)ను కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ ఈ రోజు ప్రారంభించారు. సాంకేతిక, ఆవిష్కరణ, పరిశోధన ద్వారా భారతీయ చేనేత రంగాన్ని ఆధునీకరించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఈ కార్యక్రమం ముఖ్యమైనదిగా నిలుస్తుంది.

ఈ కార్యక్రమంలో జౌళి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి నీలం షమీ రావు, అభివృద్ధి కమిషనర్ (చేనేత) డాక్టర్ ఎం బీనా, అభివృద్ధి కమిషనర్ (హస్తకళలు) శ్రీమతి అమృత్ రాజ్, ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్-ఇన్-ఛార్జ్ ప్రొఫెసర్ అరవింద్ కె.నీమా, ఐఐటీడీ డీన్ ప్రొఫెసర్ అశ్వనీ అగర్వాల్, జౌళి మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, బోధనా సిబ్బంది, పరిశోధకులు, అంకుర సంస్థల వ్యవస్థాపకులు, చేనేత పరిశ్రమ ప్రతినిధులు, చేనేత కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలకు తగిన చేనేత వ్యవస్థను రూపొందించడానికి సుసంపన్నమైన భారతీయ చేనేత వారసత్వాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మేళవించాలనే ప్రభుత్వ దార్శనికతకు ఈ ఎక్సలెన్స్ సెంటర్ ప్రతీక అన్నారు. ఉత్పాదకతను పెంచడంలో, మార్కెట్ అవకాశాలను విస్తరించడంలో, చేనేత కార్మికులకు మెరుగైన జీవనోపాధిని కల్పించడంలో ఆవిష్కరణలు, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాలు, సుస్థిరత, ఔత్సాహిక పారిశ్రామిక రంగం కీలక పాత్ర పోషిస్తాయని తెలియజేశారు. చేనేత రంగంలో ఆచరణాత్మక సాంకేతిక పరిష్కారాలను అభివృ ద్ధి చేసేందుకు విద్యాసంస్థలు, పరి శ్రమలు, ప్రభుత్వ సంస్థల మధ్య బలమైన సహకారం అవసరమని శ్రీమతి నీలం షమీ రావు తెలియజేశారు. చేనేత సరఫరా వ్యవస్థ అంతటా చేనేత కార్మికులు, డిజైనర్లు, వ్యాపారవేత్తలు, అంకుర సంస్థలకు నూతన అవకాశాలను సృష్టిస్తూ, పరిశో ధన, జ్ఞాన వినిమయం, నైపుణ్యా భివృద్ధి, ఆవిష్కరణలకు ఈ కేంద్రం ఉత్ప్రేరకంగా మారుతుందని డాక్టర్ ఎం బీనా చెప్పారు. ఈ సందర్భంగా ఈ కేంద్రానికి చెందిన అయిదు ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను ప్రారంభించారు. హ్యాండ్లూమ్ 4.0 మొబైల్ యాప్: మగ్గం ఉత్పాదకత, నాణ్య త, నిర్వహణ, స్థిరత్వాన్ని డిజిటల్ గా పర్యవేక్షించే వీలు కల్పిస్తుంది.

హ్యాండ్లూమ్ ఈ-విద్య: చేనేత రంగంలో సామర్థ్య నిర్మాణానికి ఉపకరించే సమగ్ర డిజిటల్ అభ్యాసం, విజ్ఞాన వేదిక.

హ్యాండ్లూమ్ ఎక్స్: మంత్రిత్వ శాఖకు చెందిన 5ఎఫ్ విలువ ఆధారిత వ్యవస్థలో పనిచేస్తున్న అంకుర సంస్థలు, ఆవిష్కర్తలకు తోడ్పాటును అందించే యాక్సిలరేటర్, ఇంక్యుబేషన్ వేదిక.

కళాగృహ హ్యాండ్లూమ్ స్టూడియో (జెన్ జీ డిజైన్ స్టూడియో): కస్టమైజేషన్, విజువలైజేషన్ ద్వారా ఆధునిక వినియోగదారులకు ప్రామాణిక చేనేత ఉత్పత్తులను చేరువ చేసేందుకు డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తుంది. థ్రెడ్స్ ఆఫ్ వాలం శాస్త్రీయపరమైన రీసైక్లింగ్, హస్తకళా నైపుణ్యం ద్వారా రీసైకిల్ చేసిన రక్షణ రంగానికి చెందిన వస్త్రాలను ప్రీమియం చేనేత వస్త్రాలుగా మార్చే సుస్థిర కార్యక్రమం.

మగ్గాల ఆధునికీకరణ, ఎర్గోనామిక్స్, కృత్రిమమేధ, సుస్థిరత, వనితీరును మెరుగుపరిచే ఆవిష్కరణలు, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాల్లో ఈ ఎక్సలెన్స్ సెంటర్ పరిశోధనలు చేపడుతుంది.

# కొత్తపల్లి అండర్‌పాస్‌లో వరద నీరు తొలగింపు

కరీంనగర్, ఆగష్టు 3:పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామం వద్ద రైల్వే అండర్‌పాస్‌లో నిల్వ ఉన్న వరద నీటిని అధికారులు పూర్తిగా తొలగించారు. దీంతో పెద్దపల్లి నుంచి ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ తదితర మండలాలకు వెళ్లే ప్రజలు, వాహనదారుల రాకపోకలు యథావిధిగా ప్రారంభమయ్యాయి.

గత కొన్ని రోజులుగా అండర్‌పాస్‌లో వరద నీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధికారులు చేపట్టిన చర్యలతో అండర్‌పాస్‌లోని వరద నీటిని పూర్తిగా తొలగించడంతో ప్రస్తుతం ఎలాంటి ఆటంకం లేకుండా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో స్థానికులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

# రామలక్ష్మణపల్లిలో అకాల వర్షానికి కొట్టుకుపోయిన వరి నాటు.. తీవ్ర నష్టంలో రైతులు

## నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని ప్రభుత్వానికి రైతుల విజ్ఞప్తి



కామారెడ్డి, ఆగష్టు 4:(నేటినిజం ప్రతినిధి) కామారెడ్డి జిల్లా గాంధారి మండలం రామలక్ష్మణపల్లి గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రాత్రి కురిసిన భారీ వర్షానికి పొలాల్లో నాటిన వరి నాటు పూర్తిగా కొట్టుకుపోయి, పంట దెబ్బతింది. వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో పొలాల్లోని మట్టి, రాళ్లు పేరుకుపోయి సాగుకు అనుకూలంగా లేని పరిస్థితి ఏర్పడింది. రైతులు ఎంతో ఖర్చుతో నాటు వేయగా, ఒక్క రాత్రిలోనే మొత్తం పంట నీటిపాలవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ అకాల వర్షం మరింత భారంగా మారిందని వారు వాపోయారు.

విషయం తెలుసుకున్న గ్రామ రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. నష్టాన్ని స్వయంగా పరిశీలించి రైతుల పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేయించి, బాధిత రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. అకాల వర్షాల కారణంగా వరుసగా పంటలు దెబ్బతింటుండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత రైతులకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# 2026 కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్ పతక విజేతలను నగదు బహుమతులతో

## సత్కరించిన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ



న్యూఢిల్లీ, ఆగష్టు 4:'2026 కామన్వెల్త్ - వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలను గెలిచిన క్రీడాకారులను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ఈ రోజు సత్కరించారు. గ్లాస్గోలో చరిత్రను సృష్టించిన వారి ప్రదర్శనను ఆయన ప్రశంసించారు. భారతీయ వెయిట్‌లిఫ్టర్లు 11 కేటగిరీలలో పోటీపడి, 8 పతకాలు సాధించారు. వాటిలో ఒక స్వర్ణపతకం, ఆరు రజత పతకాలతో పాటు ఒక కాంస్య పతకం కూడా ఉంది. భారతీయ క్రీడాకారుల బృందం అనేక కామన్వెల్త్ క్రీడల రికార్డులను నమోదు చేసింది. పలువురు అథ్లెట్లు కెరియర్లోనే వ్యక్తిగత అత్యుత్తమ స్థాయి ప్రదర్శ నన్చిచ్చారు.

కామన్వెల్త్ క్రీడల్లో సాధించిన అసాధారణ విజయాలకు గుర్తింపుగా స్వర్ణ పతక విజేతలకు రూ.30 లక్షలు, రజత పతక విజేతలకు రూ.20 లక్షలు, కాంస్య పతక విజేతలకు రూ.10 లక్షల నగదు పురస్కారాలను మంత్రి అందజేశారు. కామన్వెల్త్ క్రీడల్లో భారత్ తరఫున ఇంతవరకు అత్యంత ఉత్తమ స్థాయి ఫలితాలను భారతీయ వెయిట్‌లిఫ్టర్లు నమోదు చేశారు.

వెయిట్‌లిఫ్టర్ల విజయాలను చూసి దేశ ప్రజలు ఎంతో ఆనందిస్తున్నారని డాక్టర్ మాండవీయ చెప్తూ, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులను అభినందించారు. "మీరు పతకాలను గెలిచినప్పుడల్లా, ఆ విషయాన్ని పార్లమెంటులో కూడా ప్రకటించారు. ఆ క్షణాలు భారత్‌లో ప్రతి ఒక్కరూ సంతోషించేటట్లు చేశాయి" అని ఆయన అన్నారు.

కోచ్‌లపై మంత్రి ప్రశంసలు కురిపించారు. ద్రోణాచార్య పురస్కార గ్రహీత శ్రీ విజయ్ శర్మ కూడా సత్కార కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతలను తీర్చిదిద్దడంలో కోచ్‌ల పాత్ర ఎంత ముఖ్యమో మంత్రి స్పష్టం చేశారు. "ఒక అథ్లెట్ పయనంలో గురువు పోషించే పాత్ర అతి కీలకం. చాంపియన్లను తీర్చిదిద్దడంలో కోచ్ సేవలను మించింది మరేదీ లేదు" అని ఆయన అన్నారు.

ఒలింపిక్స్‌లో రజత పతక విజేత అయిన మీరాబాయి చాను.. కామన్వెల్త క్రీడల్లో వరుసగా మూడు స్వర్ణ పతకాలు గెలిచిన మొదటి భారతీయ వెయిట్‌లిఫ్టర్‌గా నిలిచారు. రుషికాంత సింగ్, వల్లూరి అజయ్ బాబు కామన్వెల్త్ క్రీడల్లో 'స్నాచ్' కేటగిరీలో నూతన రికార్డులను నెలకొల్పారు. జ్ఞానేశ్వరి యాదవ్, హర్‌జిందర్ కౌర్ సహా అనేక మంది వెయిట్‌లిఫ్టర్లు వ్యక్తిగతంగా అత్యుత్తమ స్థాయిలో రాణించారు.

పోటీకి దిగిన 11 మంది వెయిట్‌లిఫ్టర్లలో ఖేలో ఇండియా అథ్లెట్లు (కెఐఏలు) ఆరుగురు ఉన్నారు. పతకాలను గెలుచుకున్న వారిలో జ్ఞానేశ్వరి ఖేలో ఇండియా క్రీడాకారిణి. బింద్యారాణి దేవి, హర్‌జిందర్ తదితరులు పాటియాలాలో భారత క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏఐ)కి చెందిన జాతీయ ప్రావీణ్య కేంద్రం (ఎన్‌సీఓఈ)లో శిక్షణ తీసుకున్నారు. భారత్‌లో క్షేత్ర స్థాయి క్రీడాకారులను, విశిష్ట క్రీడాకారులను తీర్చిదిద్దే విస్తారిత అనుబంధ వ్యవస్థ చక్కని ఫలితాలను రాబట్టడంలో ముఖ్య పాత్రను పోషిస్తోంది ఈ సంస్థే.

క్రీడలకు రాయబారులుగా మారాల్సిందిగా క్రీడాకారులకు మంత్రి పిలుపునిచ్చారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి యువజనులు క్రీడల వైపు దృష్టి పెట్టేలా వారిలో స్ఫూర్తిని కలిగించాలని వెయిట్‌లిఫ్టర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు. "వేలాది బాలలు పెద్ద పెద్ద కలలను కనేలా మీ కథలు వారికి స్ఫూర్తిని ఇవ్వగలుగుతాయి. క్రీడలను ఎంతో ప్రేమించే దేశాన్ని ఆవిష్కరించే దిశగా మనం అందరం కలిసి అడుగులు వేద్దాం" అని మంత్రి అన్నారు.

వెయిట్‌లిఫ్టర్లతో డాక్టర్ మాండవీయ మాట్లాడుతూ వారి సంఘర్షణలను, విజయ వేదిక వరకూ వారి ప్రయాణాన్నీ, రాబోయే కాలంలో పోటీలకు సంబంధించి, ముఖ్యంగా 2026 ఆసియా క్రీడల విషయంలో వారి ఆకాంక్షలు ఏమిటన్నది అడిగి తెలుసుకున్నారు. కష్టాలకు ఎదురీదడం, జాతీయ శిక్షణ శిబిరాల్లో తోడ్పాటును అందుకోవడం, అంతర్జాతీయ స్థాయిలో అనుభవం సంపాదించడం, శాస్త్రీయంగా శిక్షణ పొందడంతో పాటు దేశానికి వరుస విజయాలను అందించాలన్న తమ దృఢ సంకల్పాన్ని గురించి క్రీడాకారులు మంత్రికి వివరించారు.

కొద్దిలో పతకాన్ని దక్కించుకోలేకపోయిన వారిని ఉద్దేశించి డాక్టర్ మాండవీయ ప్రసంగిస్తూ... ధైర్యాన్ని వీడొద్దని సూచించారు. "క్రీడాకారుడు లేదా క్రీడాకారిణి నిజానికి ఎప్పుడూ ఓడిపోరు. కావలసింది నిరంతరం మెరుగులు దిద్దుకొంటూ ఉండటమే. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశీస్సులతో పాటు 140 కోట్ల మంది భారతీయుల మద్దతు మీకు ఎప్పటికీ ఉంటుందని నేను నమ్ముతున్నాను" అని మంత్రి అన్నారు.

భారతీయ క్రీడల పట్ల ప్రభుత్వ దీర్ఘకాల దృష్టికోణాన్ని గురించి డాక్టర్ మాండవీయ స్పష్టం చేస్తూ, అనేక మంది పతక విజేతలు ఖేలో ఇండియా వంటి కార్యక్రమాల సాయంతోనే ఎదిగారన్నారు. ఖేలో ఇండియా వంటి కార్యక్రమాలు ప్రపంచ స్థాయి శిక్షణనీ, శాస్త్రీయ మద్దతునీ, పోటీపడే అనుభవాన్నీ యువ క్రీడాకారులకు అందిస్తున్నాయని ఆయన తెలిపారు. "మీ శక్తిసామర్థ్యాలపై నమ్మకం ఉన్నందువల్ల దేశం మిమ్మల్ని తీర్చిదిద్దుతోంది. భారతీయ అథ్లెట్లు ప్రపంచంలో ఉత్తమ క్రీడాకారులతో పోటీకి నిలిచేలా సాధ్యమైన అన్ని సదుపాయాలనూ సమకూరుస్తున్నాం" అని ఆయన అన్నారు.

# భూ రీ-సర్వేకు వేగం పెంచాలి

## షెడ్యూల్‌ను ముందుగానే రైతులకు తెలియజేయాలి



హన్మకొండ, ఆగష్టు 4(నేటినిజం ప్రతినిధి) భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి సర్వేయర్లను ఆదేశించారు. సర్వేకు సంబంధించిన వివరాలను ముందుగానే రైతులకు తెలియజేసి వారి సహకారంతో పనులు చేపట్టాలని సూచించారు.

మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో భూములు కొలతల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను ఇన్‌చార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాల భూమికి రీ-సర్వే పూర్తయిందని, రోజువారీగా ఎంత విస్తీర్ణంలో సర్వే నిర్వహిస్తున్నారని, ఎన్ని రోవర్ పరికరాలతో పనులు కొనసాగుతున్నాయని సర్వేయర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం రైతులతో మాట్లాడిన ఇన్‌చార్జి కలెక్టర్.. రీ-సర్వే ప్రక్రియ పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు.

ప్రస్తుతం గ్రామంలో రెండు సర్వే బృందాలు రీ-సర్వే పనులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్. రవి మాట్లాడుతూ ప్రతి సర్వే బృందం రోజుకు కనీసం 75 ఎకరాల భూమిని రీ-సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సర్వే ప్రారంభానికి ముందే కార్యాచరణ సిద్ధం చేసి, ఆయా ప్రాంతాల రైతులకు తేదీలు, సమయాలపై సమాచారం అందించాలని ఆదేశించారు.

రైతుల సమన్వయంతో నిర్ణీత లక్ష్యాల మేరకు ప్రతిరోజూ రీ-సర్వే చేపడితే గడువులోగా ప్రక్రియ పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. సర్వే పనుల్లో వేగంతో పాటు నాణ్యత, పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ పరిశీలనలో భూములు కొలతల శాఖ సహాయ సంచాలకులు నూర్ సింగ్, ఐనవోలు తహసీల్దార్ విక్రమ్ కుమార్, సర్వేయర్ సూరజ్ కుమార్, జీపీవో శ్రీకాంత్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు చర్యలు.. ఎల్లారెడ్డిపేటలో నార్కోటిక్ పోలీసుల తనిఖీలు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 4:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసల్ల జిల్లాలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు నిర్వహిస్తున్నట్లు నార్కోటిక్ పోలీసులు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు పలు కిరాణా దుకాణాలు, పాన్ డబ్బాల్లో నార్కోటిక్ జాగిలంతో మంగళవారం తనిఖీ చేశారు. డ్రగ్స్, గంజాయి క్రయ, విక్రయాలపై పోలీసులకు వివరాలు తెలపాలని సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, బస్టాండ్ లు వంటి ప్రజా రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో నార్కోటిక్ జాగిలాల సహాయంతో తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్ దెబ్బ తింటుందని పేర్కొంటూ, వాటి దుష్పరిణామాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్ లైన్ 8712671111కు తెలియ జేయాలని కోరారు. వివరాలు తెలిపిన వారి సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# లక్ష్యంతో చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారు

మెదక్, ఆగష్టు 4:విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

సిరిసిల్ల పట్టణంలోని అర్బన్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్‌రూమ్‌లో బియ్యం, పప్పులు, గుడ్లు తదితర నిల్వ పదార్థాలను పరిశీలించారు. అలాగే ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు.

తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సైన్స్ పాఠ్యాంశానికి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు.

ఈ సందర్భంగా గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులోని అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, ప్రణాళికాబద్ధంగా చదివితే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

విరామ సమయంలో ఆటలు ఆడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు కార్యాచరణ రూపొందించిన టీయూడబ్ల్యూజే - ఐజేయు

సంగారెడ్డి, ఆగష్టు 4:(నేటినిజం ప్రతినిధి): అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డులు, యూనియన్ భవనం వంటి ప్రధాన డిమాండ్లు నెరవేరే వరకు నిరంతర పోరాటం కొనసాగించాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ నిర్ణయించింది.

సోమవారం సదాశివపేటలో జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ తొలి సమావేశంలో పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులతో చర్చించారు.

ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, యూనియన్ భవనం కోసం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని సమావేశంలో నిర్ణయించారు. సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, నారాయణఖేడ్, జోగిపేట, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో కొత్త కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు హత్నూర్‌లో కూడా కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు మంజూరు చేయాలని, అక్రిడేషన్ కార్డులు అందని జర్నలిస్టులకు వెంటనే కార్డులు ఇవ్వాలని, కేబుల్ టీవీ జర్నలిస్టులకు ఒక యూనిట్ అక్రిడేషన్ కార్డు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ మాట్లాడుతూ, యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని, క్రమశిక్షణతో పనిచేస్తూ ఐక్యతను కాపాడాలని సూచించారు.

జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల సాధనలో రాజీలేని పోరాటమే మార్గమని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత ఉద్యమాలు అవసరమన్నారు. ఇటీవల నిర్వహించిన జిల్లా మహాసభను విజయవంతం చేసిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. అనిల్‌కుమార్ మాట్లాడుతూ, సంఘం కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి అన్వర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, కోశాధికారి శ్రీధర్ జైన్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్, ఉపాధ్యక్షుడు నజీర్, కోశాధికారి లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు బాసిత్, ఐజేయు సభ్యుడు సిద్దన్న పాటిల్, సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హాజీ, జిల్లా ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, వివిధ ప్రాంతాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

# పిట్టల ఎల్లయ్యపల్లెలో ఇంటింటికి పండ్ల మొక్కల పంపిణీ

కరీంనగర్, ఆగష్టు 4: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లె గ్రామంలో ఇంటింటికి పండ్ల మొక్కలను సర్పంచ్ పిట్టల రవికుమార్ మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలో ట్రాక్టర్ ద్వారా ఇంటి ఇంటికి పండ్ల మొక్కలను అందజేశారు. గ్రామంలో విరివిగా చెట్లు ఉండడం వల్ల ఆహ్లాదకర వాతావరణంతో పాటు మంచి గాలి దొరుకుతుందని పేర్కొన్నారు.

# పిట్లం మండలంలో భారీ వర్షం..

## -పరిస్థితిని పరిశీలించేందుకు ఆర్డీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ మహేందర్



కామారెడ్డి, ఆగష్టు 4:(నేటినిజం ప్రతినిధి)పిట్లం మండల వ్యాప్తంగా నిన్న కురిసిన భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో దాదాపు 127 మి.మీ నుంచి 141.1 మి.మీ వరకు వర్షపాతం నమోదైనట్లు సమాచారం. దీంతో పిట్లం మండలంలోని కాకి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పిట్లం-తిమ్మానగర్ గ్రామాల మధ్య ఉన్న వంతెనపైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అలాగే కంబాపూర్ తదితర గ్రామాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని పరిశీలించేందుకు ఆర్డీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ మహేందర్ మండలంలోని పలు గ్రామాలను సందర్శించి వంతెనలు, వాగుల పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంతెనలు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచించారు.

# రూ.52కే నాణ్యమైన సోనామసూరి బియ్యం

## -తూర్పుగోదావరి జిల్లాలో 45 కేంద్రాల ద్వారా సరఫరా

అమరావతి, ఆగష్టు 4:రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో నిడదవోలు పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో రైతు బజార్లు, రైస్ మిల్లుల ప్రత్యేక అవుట్‌లెట్ల ద్వారా తక్కువ ధరకే సన్నబియ్యం విక్రయ కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.65 వరకు విక్రయమవుతున్న నాణ్యమైన సోనామసూరి బియ్యాన్ని ప్రభుత్వం కేవలం కిలో రూ.52కే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రతి వ్యక్తి లేదా కుటుంబానికి నెలకు గరిష్టంగా 10 కిలోల చొప్పున బియ్యం అందజేస్తామని తెలిపారు.

ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 45 కేంద్రాల ద్వారా బియ్యం సరఫరా జరుగుతోందని వెల్లడించారు. ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు నిడదవోలు నియోజకవర్గంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని ప్రత్యేక అవుట్‌లెట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు.

ధనిక-పేద అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం నాణ్యమైన బియ్యం తినాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమన్వయంతో ప్రజలకు మేలు చేసే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన ఆహార ధాన్యాలను అందుబాటు ధరల్లో అందించడం ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు మెరుగైన ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# చాట్రాయిలో మంత్రులను కలిసిన కలెక్టర్ వెట్రిసెల్వి..



అమరావతి, ఆగష్టు 4:చాట్రాయి మండలంలో మంగళవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు హాజరైన రాష్ట్ర వైద్య, ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్, నూజివీడు నియోజకవర్గ పరిశీలకుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. యు. శోభ, డీసీహెచ్ఎస్ డా. సి.హెచ్. బేబీకమల, ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ రాజీవ్, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జులైలో క్యాప్టివ్, వాణిజ్య గనుల్లో నెలవారీ ఉత్పత్తి, రవాణాలో కొనసాగిన వృద్ధి

న్యూఢిల్లీ, ఆగష్టు 4:క్యాప్టివ్, వాణిజ్య బొగ్గు గనుల రంగం తన బలమైన వృద్ధిని కొనసాగిస్తూ.. 2026 జులైలో అధిక ఉత్పత్తిని సాధించింది. తద్వారా భారత బొగ్గు రంగంలో పెరుగుతున్న తన పాత్రను బలోపేతం చేస్తోంది. ఈ నెలలో క్యాప్టివ్, వాణిజ్య గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి 14.78 మిలియన్ టన్నులకు (ఎంటీ) చేరుకుంది. అదే సమయంలో బొగ్గు రవాణా 17.49 ఎంటీలకు చేరుకుంది. 2025 జులైతో పోలిస్తే.. బొగ్గు ఉత్పత్తిలో 9.61 శాతం వార్షిక వృద్ధి నమోదయింది. ఇది మైనింగ్ కార్యకలాపాల్లో సాధిస్తున్న స్థిరమైన వృద్ధినీ, దేశీయ బొగ్గు ఉత్పత్తిలో పెరుగుతున్న ఈ గనుల వాటాను ప్రతిబింబిస్తోంది.

క్యాప్టివ్, వాణిజ్య బొగ్గు మైనింగ్ రంగంలో కార్యాచరణ సామర్థ్యంలో నిరంతరం సాధిస్తున్న మెరుగుదలను, మైనింగ్ ఉత్పాదకత పెంపును, మైనింగ్ సామర్థ్యాల సమర్థ వినియోగాన్ని ఈ ప్రోత్సాహకరమైన పనితీరు వివరిస్తుంది.

క్యాప్టివ్, వాణిజ్య గనుల్లో పెరిగిన సుస్థిరమైన ఉత్పత్తి.. బొగ్గు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందనీ, సరఫరా వ్యవస్థల స్థిరత్వాన్ని బలోపేతం చేస్తుందనీ, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేస్తుందనీ అంచనా వేస్తున్నారు. అలాగే దేశ ఇంధన భద్రత, పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన కీలక ముడి పదార్థంలో స్వయం సమృద్ధిని పెంచడం ద్వారా ఆత్మనిర్భర భారత్ దార్శనికతను ముందుకు తీసుకెళుతుందని భావిస్తున్నారు.

క్యాప్టివ్, వాణిజ్య బొగ్గు గనుల రంగం పూర్తి సామర్థ్యాన్ని వెలికి తీయడానికి బొగ్గు మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. ప్రగతిశీల విధాన చర్యలు, పటిష్టమైన నియంత్రణ పర్యవేక్షణ, భాగస్వాముల నిరంతర మద్దతు ద్వారా ఉత్పత్తి వృద్ధిని కొనసాగించడాన్నీ, సరఫరా సంబంధిత పరిమితులను పరిష్కరించడాన్నీ, బొగ్గు లభ్యతను మెరుగుపరచడాన్నీ కొనసాగిస్తుంది. అదే సమయంలో పెరుగుతున్న దేశ ఇంధన, వాణిజ్య అవసరాలను తీర్చడంలో ఈ రంగం విశ్వసనీయమైన సహకారం అందించేలా చూస్తోంది.

# సవాళ్లను ఎదుర్కొనే బలమైన రక్షణ వ్యవస్థకు

## సైనిక-పౌర విభాగాలభాగస్వామ్యం కీలకం: ఏఎఫ్‌హెచ్‌క్యూ సివిలియన్ సర్వీసెస్ డే వేడుకల్లో రక్షణ మంత్రి




న్యూఢిల్లీ, ఆగష్టు 4:రక్షణ దళాలు కొత్త ఉత్సాహంతో ఉమ్మడి కార్యాచరణ దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో రక్షణ మంత్రిత్వ శాఖలోని సైనిక, పౌర విభాగాల మధ్య అనుసంధానాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. మారుతున్న భద్రతా, సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు రక్షణ వ్యవస్థలో మెరుగైన సమన్వయాన్ని పెంపొందించడంతోపాటు వ్యవస్థాగత అనుభవం, స్థిరత్వం, నిబంధనల సమర్థవంతమైన అమలును నిర్ధారించడం చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ఆగష్టు 03, 2026న న్యూఢిల్లీలో జరిగిన 85వ సాయుధ దళాల ప్రధాన కార్యాలయం (ఏఎఫ్‌హెచ్‌క్యూ) పౌర సేవల దినోత్సవ వేడుకల్లో రక్షణ మంత్రి ప్రసంగిస్తూ.. సైనిక, పౌర సేవలు రెండూ 'దేశమే ప్రథమం' అనే ఉమ్మడి నిబద్ధతను చాటుకుంటాయని అన్నారు. లక్ష్యం ఒకటే అయినప్పుడు వ్యవస్థలోని ప్రతి అంశం జాతీయ శక్తిగా మారుతుందని చెప్పారు.

సైనిక, పరిపాలనా సమైక్యత వేర్వేరు మార్గాల్లో సాగలేవని రక్షణ మంత్రి తెలిపారు. ఉమ్మడి వ్యవస్థలు రూపొందుతున్న కొద్దీ విధానాలు, పరిపాలన, మానవ వనరుల నిర్వహణ, ఆర్థిక ప్రక్రియలు, లాజిస్టిక్స్, వ్యవస్థాగత పరిజ్ఞానం వంటి అన్ని రంగాల్లో నిరంతరాయమైన నైపుణ్యం అవసరమని తెలిపారు. పౌర, సైనిక అధికారుల మధ్య పరస్పర అవగాహనను మరింత పెంచాల్సి అవసరం ఉందన్నారు. ఇరుపక్షాలు ఒకరి అనుభవాల నుంచి మరొకరు నేర్చుకోవడానికి ఉమ్మడి శిక్షణ కార్యక్రమాలు, అభివృద్ధి ఆధారిత నియామకాలు చేపట్టాలని ప్రతిపాదించారు.

'సైబర్ వార్‌ఫేర్' గురించి రక్షణ మంత్రి వివరిస్తూ.. ఏఎఫ్‌హెచ్‌క్యూ పౌర సేవల అధికారులు తమ నైపుణ్యాన్ని ఉపయోగించి రక్షణ రంగానికి ప్రత్యేకమైన సైబర్ పరికరాలను తయారుచేస్తే, అది రక్షణ దళాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. భారత సైనిక చరిత్రను పౌర దృక్పథంతో పరిశీలిస్తూ, అధ్యయనం చేయడానికి ఒక వేదికను ఏర్పాటు చేయవచ్చని సూచించారు. దీనివల్ల వినూత్న ఆలోచనలు, కొత్త దృక్పథాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. ఇలాంటి రంగాల్లోని నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడం ద్వారా ఏఎఫ్‌హెచ్‌క్యూ పౌర సేవలు రక్షణ రంగానికి మరింత అర్థవంతమైన సేవలు అందించగలవని విశ్వాసం వ్యక్తం చేశారు.

"సైనిక అధికారులు క్షేత్రస్థాయి అనుభవం, కమాండింగ్ దృక్పథం, యుద్ధ వ్యూహాలపై అవగాహనను పెంపొందిస్తారు. అలాగే సివిల్ అధికారులు పరిపాలనా కొనసాగింపు, విధానపరమైన అనుభవం, ప్రభుత్వ ప్రక్రియలపై పట్టు, వ్యవస్థాగత పరిజ్ఞానాన్ని అందిస్తారు. ఈ రెండు బలాలు కలిసి పనిచేసినప్పుడు నిర్ణయాధికారం మరింత సమగ్రంగా, సమతుల్యంగా, ప్రభావవంతంగా మారుతుంది" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

భారత రక్షణ నిర్వహణ వ్యవస్థకు వ్యూహాత్మక 'మేధోకేంద్రం' లాగా ఏఎఫ్‌హెచ్‌క్యూ పౌర సేవలు ఎదగాలని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఇందుకోసం రక్షణ రంగాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలనీ, ఉమ్మడి వాతావరణంలో సమర్థవంతంగా పనిచేయాలనీ, ఎదురవుతున్న నూతన సవాళ్లను తట్టుకునేలా నైపుణ్యాలను నిరంతరం పదును పెట్టుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ సేవలు ముందుకు సాగుతున్న తీరును ఆయన అభినందించారు. సాంకేతిక మార్పులతో ఆధునిక యుద్ధాలు సాగుతున్న ఈ రోజుల్లో.. కేవలం సేవా నియమాలు, నిబంధనలు, ఆదేశాలను సరిగా అమలు చేయడానికే ఈ వ్యవస్థ పరిమితం కాకూడదని స్పష్టం చేశారు.

"ఒక సైన్యానికి కేవలం ఆయుధాలు, మందుగుండు సామగ్రి మాత్రమే బలాన్ని ఇవ్వవు. వారికోసం నిరంతరం వెనుక ఉండి పనిచేసే వేలాది అదృశ్య హస్తాలు కూడా ఆ బలానికి కారణం. ఏఎఫ్‌హెచ్‌క్యూ పౌర సేవలు కూడా అలాంటి ఒక అదృశ్య, అత్యంత కీలక శక్తుల్లో ఒకటి.

పరిశోధనలు, భౌగోళిక-వ్యూహాత్మక ఆలోచనలు, వినూత్న ప్రతిపాదనల ద్వారా జాతీయ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడంపై ఈ అధికారులు దృష్టి పెట్టాలి. రక్షణ మంత్రిత్వ శాఖలో ఇదొక శాశ్వత వ్యవస్థ కావడం వల్ల దీనికి లోతైన శాఖాపరమైన పరిజ్ఞానం ఉంటుంది కాబట్టి కీలక రక్షణ అంశాల్లో ఈ విభాగం చురుగ్గా పాల్గొనడం చాలా అవసరం" అని పేర్కొన్నారు.

ఈ వేడుకల్లో భాగంగా సంయుక్త కార్యదర్శి, ముఖ్య పరిపాలనాధికారి (జేఎస్, సీఏఓ) కార్యాలయానికి చెందిన పలు డిజిటల్ కార్యక్రమాలను ప్రారంభించారు. అలాగే, సవరించిన దార్శనిక, లక్ష్య పత్రాలను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఆవిష్కరించారు. వీటిలో ఇంటర్నెట్ ఆధారిత నివాస వసతి నిర్వహణ వ్యవస్థ (ఐబీఏఎంఎన్) తీజీఎబప్త్రజీజీలిజీబ.ఇజీనీఎనీట.ఐనీల.తిని వేదిక, క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ కోసం తులిప్ 2.0 తో ఈహెచ్‌ఆర్ఎంఎస్ అనుసంధానం, జీతభత్యాల ప్రక్రియ కోసం తులిప్ 2.0 తో సీఏఓ కార్యాలయ అనుసంధానం, స్పారో (స్మార్ట్ పెర్ఫార్మెన్స్ అప్రైజల్ రిపోర్ట్ రికార్డింగ్ ఆన్‌లైన్ విండో) వేదికలో నమోదు చేయడం వంటివి ఉన్నాయి.

సర్వీస్ ప్రధాన కార్యాలయాలు, అంతర్-సేవా సంస్థల్లో పనిచేస్తున్న వివిధ హోదాల సిబ్బంది రాసిన ప్రయాణ కథనాలు, వ్యాసాలు, కవితలతో కూడిన 'సంవాద్' పత్రిక 34వ సంచికను రక్షణ మంత్రి విడుదల చేశారు. క్రీడలు వంటి వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఏఎఫ్‌హెచ్‌క్యూ సిబ్బందికి, చదువులో రాణించిన ఉద్యోగుల పిల్లలకు ఆయన పురస్కారాలు అందించారు.

ఈ కార్యక్రమంలో రక్షణశాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్, త్రివిధ దళాల అధిపతి జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, నౌకాదళ అధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, భారత సైన్యాధిపతి జనరల్ ధీరజ్ సేథ్, రక్షణశాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్, కార్యదర్శి (రక్షణ ఉత్పత్తి) శ్రీ సంజీవ్ కుమార్, కార్యదర్శి (రక్షణ ఆర్థిక విభాగం) శ్రీ విశ్వజిత్ సహాయ్, వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్, అదనపు కార్యదర్శి శ్రీ మనీష్ త్రిపాఠి, సంయుక్త కార్యదర్శి, ముఖ్య పరిపాలనా అధికారి శ్రీ అమితాబ్ ప్రసాద్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సైనిక బలగాల సిబ్బందితో సమానంగా పనిచేసే ఉద్యోగుల సేవలను గుర్తించేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి రోజున ఏఎఫ్‌హెచ్‌క్యూ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. వీరు ప్రధానంగా మూడు ఇంటిగ్రేటెడ్ సర్వీస్ హెడ్‌క్వార్టర్స్, హెడ్‌క్వార్టర్స్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్, రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని 24 ఇంటర్-సర్వీస్ సంస్థల్లో సేవలు అందిస్తారు.

ముఖ్య పరిపాలనా అధికారి పర్యవేక్షణలో వివిధ సేవల ప్రధాన కార్యాలయాలు, రక్షణ, ఆర్థిక శాఖ సచివాలయం పరిధిలో అప్పటి వికేంద్రీకృత పౌర పోస్టులు, కార్యకలాపాలను ఒక ప్రత్యేక వ్యవస్థగా ఏర్పాటు చేయడం ద్వారా 1942 ఆగస్టు 01న ఏఎఫ్‌హెచ్‌క్యూ వ్యవస్థకు నాంది పడింది.

# కామన్వెల్త్‌లో చరిత్రాత్మక విజయం సాధించిన వెయిట్‌లిఫ్టింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 4:గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో రికార్డు స్థాయిలో వరుసగా మూడో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించిన ప్రముఖ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చానుతో ఈ రోజు న్యూఢిల్లీలో కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా సమావేశమయ్యారు.

అసాధారణ విజయం సాధించిన మీరాబాయి చానును శ్రీ సింధియా అభినందించారు. ఆమె దృఢ సంకల్పం, క్రమశిక్షణ, పట్టుదలను ప్రశంసించారు. దేశంలో ఉన్న వేలాది మంది యువ క్రీడాకారులకు ముఖ్యంగా ఈశాన్య ప్రాంతానికి చెందిన వారికి ఆమె విజయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు.

భారతదేశంలో ప్రసిద్ధి పొందిన క్రీడాకారుల్లో ఒకరిగా ఎదిగే క్రమంలో సాగించిన స్ఫూర్తిదాయక ప్రయాణం గురించి, ఎదుర్కొన్న సవాళ్ల గురించి మీరాబాయి చాను ఈ సందర్భంగా వివరించారు. అత్యుత్తమంగా రాణించడంలో శిక్షణ పద్ధతులు, పోషకాహారం, రికవరీ దశలు, తగినంత నిద్రతో సహా క్రీడలకు సంబంధించిన వివిధ అంశాలపై ఆమెతో కూలంకషంగా మంత్రి చర్చించారు.

మీరాబాయి చాను కోచ్, ట్రైనర్, ఫిజియోథెరపిస్టు అందించిన అమూల్యమైన సేవలను కూడా మంత్రి ప్రశంసించారు. శాస్త్రీయ శిక్షణ, నిపుణుల మార్గదర్శకత్వంతో కూడిన బలమైన తోడ్పాటు వ్యవస్థపై ప్రపంచ స్థాయి క్రీడా విజయం ఆధారపడి ఉంటుందని ఆయన అంగీకరించారు.

క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ దార్శనికతను మంత్రి సింధియా తెలియజేశారు. అత్యున్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ (హెచ్ఎల్‌టీఎఫ్) ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో సమగ్ర క్రీడా వ్యవస్థ అభివృద్ధి గురించి సింధియా చర్చించారు. ఈ టాస్క్‌ఫోర్స్ ద్వారా 'ఒక రాష్ట్రం, ఒక క్రీడ' కార్యక్రమంపై ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ దృష్టి సారిస్తోంది. దీని పరిధిలో వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, ఫుట్‌బాల్ వంటి క్రీడాంశాలతో సహా సహజ పోటీ ప్రయోజనం ఉన్న క్రీడల్లో ప్రతిభ కనబరిచేలా ప్రతి ఈశాన్య రాష్ట్రానికి మద్దతు లభిస్తోంది.

ఈ కార్యక్రమం కేవలం మౌలిక వసతులను సిద్ధం చేయడం గురించి మాత్రమే కాదనీ, నాణ్యమైన కోచింగ్, శాస్త్రీయపరమైన శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, పోషకాహారం, రికవరీ, అథ్లెట్‌కు తోడ్పాటునందించడంపై దృష్టి సారించిన ప్రపంచ స్థాయి క్రీడా వ్యవస్థను సృష్టించడం గురించి అనీ కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలోనే నాణ్యమైన శిక్షణ, వసతులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా క్రీడల్లో రాణించేందుకు మరింత మంది యువ క్రీడాకారులు స్ఫూర్తి పొందుతారనీ, ఈశాన్య ప్రాంతం నుంచి మీరాబాయి చాను లాంటి మరింత మంది ఛాంపియన్లను తయారుచేయడానికి వీలవుతుందనీ ఆయన చెప్పారు. ఈశాన్య ప్రాంతంలోని క్రీడాకారుల సామర్థ్యం గురించి చానుకి శిక్షణ ఇచ్చిన విజయ్ శర్మ వివరించారు. ఈ కార్యక్రమాలు క్షేత్రస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించడంలో సాయపడతాయని అంగీకరించారు.

ఈశాన్య ప్రాంతం విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా.. ప్రతిభ, ఉత్తమ కోచింగ్, అథ్లెట్ల అభివృద్ధికి నిధులు కేటాయించడం ద్వారా క్రీడా వ్యవస్థను బలోపేతం చేయాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధిని ఈ సమావేశం పునురుద్ఘాటిస్తోంది. అలాగే ఈశాన్య ప్రాంతంలోని క్రీడా సామర్థ్యాన్ని వెలికి తీయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సమావేశం పునరుద్ఘాటించింది.

# ఎవరైనా రాజీనామా చేస్తే.. క్షణాల్లో ఆమోదిస్తా: సీఎం డీకే శివకుమార్



బెంగుళూరు, ఆగష్టు 4: కర్నాటక సీఎం డీకే శివకుమార్ అసంతృప్తి ఎమ్మెల్యేలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఎవరైనా రాజీనామా చేస్తే, వారి రాజీనామాను క్షణాల్లో ఆమోదించనున్నట్లు చెప్పారు. సోమవారం సుమారు 20 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే కొత్త కేబినెట్‌లో మంత్రి పదవి దక్కని కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తితో చెలరేగిపోతున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేసినట్లు కూడా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం డీకే శివకుమార్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎవరైనా ఎమ్మెల్యే రాజీనామా చేస్తే దాన్ని క్షణాల్లో ఆమోదిస్తానన్నారు. కానీ దానికి ముందు వారితో వ్యక్తిగతంగా మాట్లాడనున్నట్లు చెప్పారు.

ఇక మంగళవారం నుంచే కొత్త మంత్రులు అందరూ కరువు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే విజిట్ చేయాలని ఆదేశించినట్లు డీకే తెలిపారు. సోమవారం మొత్తం 20 మంది ఎమ్మెల్యేలు .. మంత్రులుగా ప్రమాణం చేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండు నెలల్లోనే పూర్తి స్థాయిలోనే కేబినెట్‌ను విస్తరించారు.

రాజీనామా చేయాలనుకుంటున్న ఎమ్మెల్యేలు ఓపికతో ఉండాలన్నారు. దాని కోసం ఆయన తన ఉదాహరణ ఇచ్చాడరు. ధరమ్ సింగ్ పాలన సమయంలోనైనా, లేక సిద్ధరామయ్య, పరమేశ్వర పాలన సమయంలోనైనా తాను సంయమనంతో వేచి ఉన్నట్లు గుర్తు చేశారు

# అనిశెట్టిపల్లి వద్ద ఉప్పొంగిన పుణ్యాపు వాగు.. ఆళ్లపల్లికి రాకపోకలు నిలిచివేత

ఖమ్మం, ఆగష్టు 4:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జల్లేరు, కిన్నెరసాని, కోడెల, తునికిదున్నే వాగులతో పాటు పలు చిన్న వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

కొత్తగూడెం-మర్కోడు-ఆళ్లపల్లి ప్రధాన రహదారిపై అనిశెట్టిపల్లి గ్రామ శివారులోని పుణ్యాపు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగు ఉప్పొంగడంతో అక్కడికి చేరుకున్న ఆర్టీసీ బస్సు ముందుకు వెళ్లలేక నిలిచిపోయింది. ఫలితంగా జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు దాటేందుకు ప్రయత్నించవద్దని పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు హెచ్చరించారు.

గర్భిణులు, బాలింతలు లేదా అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారు వాగులు దాటాల్సిన పరిస్థితి ఉంటే ముందుగానే పోలీసు శాఖ లేదా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకునే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

# వాగు ఉధృతితో బ్రిడ్జిపై వరద.. రాకపోకలు నిలిపివేత

నల్గొండ, ఆగష్టు 4: యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ మండలం సంగెం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు వాగులో వరద నీరు పెరగడంతో బ్రిడ్జిపైకి నీరు చేరింది. దీంతో సంగెం-భువనగిరి మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బ్రిడ్జిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరిస్థితిని గమనించిన అధికారులు బ్రిడ్జి వద్ద అప్రమత్త చర్యలు చేపట్టి, ఎవరూ వరద నీటిలో ప్రయాణించవద్దని హెచ్చరించారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని, బ్రిడ్జిపైకి వెళ్లే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచించారు. పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉన్నారు.

# బాబాపూర్ గ్రామ పంచాయతీ తనిఖీ

## -పెండింగ్ హౌస్ ట్యాక్స్ వసూళ్లకు చర్యలు తీసుకోవాలి: ఎంపీవో యూసఫ్ ఖాన్



నిజామాబాద్, ఆగష్టు 4: (నేటినిజం ప్రతినిధి) నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్ గ్రామ పంచాయతీని మంగళవారం స్థానిక ఇన్‌చార్జి ఎంపీవో యూసఫ్ ఖాన్ తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సెక్రటరీ సంతోష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మురికి కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పరిశీలించాలని పంచాయతీ సెక్రటరీకి సూచించారు.

అలాగే పెండింగ్‌లో ఉన్న హౌస్ ట్యాక్స్‌లను వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# ఈ20 పెట్రోల్ అమ్మకండి.. పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం



చండీఘడ్,ఆగష్టు 4: దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ అమ్మకాలపై ఆందోళన వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహనాలు దెబ్బతింటున్నట్లు కొన్ని చోట్ల ఫిర్యాదులు అందాయి. అయితే దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ ఇవాళ పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం పాస్ చేశారు. 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాన్ని పంజాబ్ అసెంబ్లీ వ్యతిరేకించింది. ఇథనాల్ ఫ్రీ పెట్రోల్‌తో పాటు ఈ20 పెట్రోల్ ఎంపిక చేసుకునే అవకాశం వినియోగదారుడికి ఇవ్వాలని సభలో డిమాండ్ చేశారు. ఈ20 పెట్రోల్‌కు తగినట్లు డిజైన్ లేని వాహనాల్లో దాన్ని వాడడం వల్ల సమస్యలు వస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ఈ20 వాడకం వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గుతుంది కాబట్టి, ఆ సామర్థ్యానికి తగినట్లు ఈ20 పెట్రోల్ రిటేల్ ధరను తగ్గించాలని తీర్మానంలో కోరారు. ఆటోమొబైల్ ఇంజినీర్లు, పెట్రోలియం నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, వినియోగదారుల సంఘాలు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో ఓ వ్యక్తిగత కమిటీని ఏర్పాటు చేసి ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై సమగ్రమైన స్టడీ చేయాలని తీర్మానంలో కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

సీఎం భగవంత్‌మాన్ సింగ్ సభలో మాట్లాడుతూ సుమారు 45వేల వాహనాలపై ఈ20 ప్రభావం గురించి స్టడీ చేశారని, ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడడం వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గినట్లు గుర్తించారని, కొన్ని వాహనాలు పాడైనట్లు కూడా ఆయన చెప్పారు. అసలు ఈ20 విషయంలో ప్రధాని మోదీ ఎందుకు పట్టుపట్టారని, ఇదేమీ నితిన్ గడ్కరీ కుమారుడికి లాభం తెచ్చిపెట్టదని, ఎందుకంటే మోదీకి, ఆయనకు మంచి సంబంధాలు లేవని, కేవలం అమెరికా ప్రభుత్వ వత్తిడి వల్లే ఈ20 పెట్రోల్ అమ్మకాలపై కేంద్రం వత్తిడి తెస్తున్నట్లు భగవంత్ మాన్ ఆరోపించారు.

ఇటీవల అమెరికాతో వంద బిలియన్ల డాలర్ల వాణిజ్య ఒప్పందం కుదిరిందని, దానిలో భాగంగా 5 బిలియన్ల లీటర్ల ఇథనాల్ భారత్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని భగవంత్‌మాన్ ఆరోపించారు.

# విమానాలలో ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టాలి : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



న్యూ ఢిల్లీ, ఆగష్టు 4:విమానాలలో క్రమశిక్షణ, ప్రయాణికుల భద్రత, ప్రయాణికులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో ప్రశ్నించారు. ఇందుకు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ స్పందిస్తూ..విమానాలు, ప్రయాణీకులు, ఆస్తుల భద్రతను నిర్ధారించడం, విమానాల్లో క్రమశిక్షణ తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక విభాగాలతో పాటు స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు.

విమానాలలో క్రమశిక్షణ, ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా అవాంఛనీయ లేదా అల్లరి ప్రవర్తనను నియంత్రించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్, సెక్షన్-3, ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్, సిరీస్-ఎం, పార్ట్-6 కింద 'హ్యాండ్లింగ్ ఆఫ్ అన్‌రూలీ,డిస్‌రప్టివ్ ప్యాసింజర్స్' పేరుతో ప్రత్యేక మార్గదర్శకాలు ఉన్నాయని ఎంపీ రవిచంద్రకు మంత్రి మొహోల్ తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న ప్రయాణికుల కోసం క్యాబిన్ సేఫ్టీ సర్క్యులర్-01/2016 ప్రకారం మార్గదర్శకాలు అమలులో ఉన్నాయని మంత్రి బదులిచ్చారు.

అలాగే, ప్రయాణీకుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు గాను తమ శాఖ 24 గంటల 'ప్యాసింజర్ అసిస్టెన్స్' కంట్రోల్ రూమ్‌ను అనుసంధానం చేసి విమానాల రాకపోకల సమయం, సామాన్ల భద్రత, వాటి చేరవేతలో తలెత్తిన సమస్యలు, రీఫండ్ అంశాలను డీజీసీఏ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విమానయాన సంస్థలతో సమన్వయం చేస్తూ పర్యవేక్షిస్తున్నట్లు ఎంపీ రవిచంద్రకు ఇచ్చిన సమాధానంలో మంత్రి వెల్లడించారు. అదనంగా, ప్రయాణికుల ఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం ఎయిర్ సేవా పోర్టల్, మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి మొహోల్ ఎంపీ వద్దిరాజుకు ఇచ్చిన సమాధానంలో వివరించారు.

# నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ -మానవ చరిత్రలో చంద్రునిపై తొలి అడుగు వేసిన మానవుడు

## ఆగస్టు 5...నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జయంతి

నీల్ ఆల్డెన్ ఆర్మ్‌స్ట్రాంగ్.. ఈ పేరు వినగానే మానవ శాస్త్ర విజ్ఞాన సాధనలో అత్యున్నత ఘట్టం స్మరణ లోకి వస్తుంది. ఆయన చంద్రుడిపై తొలిసారిగా అడుగు పెట్టిన వ్యక్తిగా, కేవలం అమెరికాకే కాదు, ప్రపంచ మానవ జాతి విజయ గాథలకు సజీవ చిహ్నంగా నిలిచాడు. ఒక వైపు వైమానిక శాస్త్రానికి మార్గదర్శకుడై, మరోవైపు మానవ కలలకు సాధ్యతను నిరూపించిన విశిష్ట వ్యక్తిత్వం ఆయనది. అందుకే నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జీవితం ఓ అధ్యాయంగా, ఆధ్యాత్మికంగా కూడ మానవోన్నతికి సంకేతంగా మారింది.

నీల్ ఆల్డెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ..అంతరిక్ష పరిశోధనకు, మానవ శాస్త్ర సాహసాలకు సజీవ సంకేతంగా నిలిచిన ఒక ప్రతిభాశాలి. అమెరికా దేశానికి చెందిన ఈ వ్యోమగామి, పైలట్, ఏరోనాటికల్ ఇంజనీర్, విద్యావేత్తగా అనేక రంగాలలో తన సత్తా చాటాడు. 1969 జూలై 20న చంద్రుడిపై అడుగుపెట్టిన తొలి మానవుడిగా ఆయన పేరును శాశ్వతంగా చరిత్రలో లిఖించు కున్నారు.

1930 ఆగస్టు 5న అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలోని వాపాకొనెటా అనే పట్టణంలో ఆయన జన్మించారు. బాల్యము నుంచే విమానాలపై ఆకర్షణతో ఆయన ఆకాశాన్ని తాకే కలలతో పెరిగాడు. 16వ ఏట ప్రైవేట్ పైలట్ లైసెన్స్ పొందిన ఆర్మ్‌స్ట్రాంగ్, పర్డ్యూ విశ్వ విద్యాలయంలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ లో డిగ్రీ అభ్యసించాడు. కొరియన్ యుద్ధ సమయంలో అమెరికన్ నేవీలో పైలట్‌గా పనిచేసి అనేక యుద్ధ వాహనాలపై విజయవంతమైన సాహసాలను నిర్వహించాడు. యుద్ధం తర్వాత వైమానిక పరిశోధనలలో తలమునక లయ్యాడు.

1955లో నేషనల్ అడ్వైజరీ కమిటీ ఫర్ ఏరోనాటిక్స్ లో ప్రయోగాత్మక పైలట్‌గా చేరిన ఆర్మ్‌స్ట్రాంగ్, అధిక వేగం గల విమానాల పరీక్షలలో విశేషంగా పాల్గొన్నాడు. 1962లో నాసా వ్యోమగాముల బృందంలోకి చేరిన తర్వాత ఆయన ప్రయాణం మరింత పురోగతిని సంతరించుకుంది. 1966లో జెమిని 8 మిషన్‌లో కమాండర్‌గా వ్యవహరించి అంతరిక్షంలో తొలిసారిగా డాకింగ్ అనే సాంకేతికతను విజయవంతంగా నిర్వహించాడు. ఇది చంద్ర యానానికి కీలకమైన సాంకేతిక విజయంగా పరిగణించ బడింది.

1969 జూలై 16న ప్రారంభమైన అపోలో 11 మిషన్, మానవజాతి చరిత్రలో విశిష్ట



ఘట్టంగా నిలిచింది. ఈ మిషన్ ద్వారా చంద్రునిపై మానవుడి అడుగుపెట్టే యత్నానికి శ్రీకారం చుట్టారు. ఆర్మ్‌స్ట్రాంగ్‌తో పాటు బజ్ ఆల్డ్రిన్, మైఖేల్ కాలిన్స్‌లు ఈ మిషన్‌లో భాగస్వాములయ్యారు. జూలై 20న చంద్రుడిపై ఈగిల్ లూనార్ మాడ్యూల్ విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. ఆర్మ్‌స్ట్రాంగ్ తొలిసారి చంద్రుడి ఉపరితలంపై అడుగుపెట్టి, మానవ చరిత్రను కొత్త దిశలో నడిపించాడు. "ఈ ఒక్క అడుగు మనిషికి చిన్నదైనా, మానవ జాతికి గొప్ప ముందడుగు" అని పలికిన ఆయన మాటలు శాశ్వతంగా చెవుల్లో మ్రోగుతూనే ఉంటాయి. ఆ సంఘటనను ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 60 కోట్ల మంది ప్రత్యక్షంగా టెలివిజన్ ద్వారా వీక్షించారు.

చంద్రయానం అనంతరం ఆర్మ్‌స్ట్రాంగ్ నాసా నుండి పదవీ విరమణ చేసి, సిన్సినాటి విశ్వ విద్యాలయంలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా పని చేశాడు. ఆయన జీవితమంతా నిరాడంబరంగా, ప్రజల కీర్తికి దూరంగా, విజ్ఞాన నిష్ఠతో గడిపాడు. ప్రభుత్వాలకు సాంకేతిక సలహాలు అందిస్తూ, అంతరిక్ష పరిశోధనల భవిష్యత్తుకు దోహదం చేశాడు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఆయన, భౌతిక శాస్త్రం పట్ల అవగాహన పెరిగేలా చేసే కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. అయినా, ఎక్కడా తన ఘనతను కొనియాడు కోలేదు.

2012 ఆగస్టు 25న ఈ మహోన్నత వ్యక్తి కన్నుమూశాడు. ఆయన మరణానికి అమెరికా మాత్రమే కాక ప్రపంచ దేశాలన్నీ శోకసంద్రంలో మునిగి పోయాయి. నాసా కేంద్రాలు, పాఠశాలలు, రహదారులు ఆయన పేరుతో స్థాపించ బడ్డాయి. ఆర్మ్‌స్ట్రాంగ్ జీవితగాథ యుగయుగాల పాటు యువతలో ఆత్మ విశ్వాసాన్ని, కలల సాధన తపనను నూరిపోస్తుంది.

ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై వేసిన అడుగు కేవలం శాస్త్రీయ మైలురాయి కాదు.. అది మానవోన్నతిని ప్రతిబింబించిన ఆత్మ నిష్ఠ అడుగు. శూన్యాకాశంలో భూమివాసి వేసిన ఆ అడుగు, మానవ బుద్ధికి, సంకల్పానికి, విజ్ఞానాన్వేషణకు సాక్ష్యంగా నిలిచింది. ఒక సాధారణ వ్యోమగామిగా ప్రయాణం ప్రారంభించిన ఆయన, మానవ చరిత్రలో ఒక గొప్ప ఆధ్యాత్మిక నడకను ఆవిష్కరించిన మహా పురుషుడిగా నిలిచి పోయాడు. భూమి నుంచి చంద్రుని దాకా విస్తరించిన ఆ నడక ? ప్రతి మనిషిలోని కలల పక్షికి రెక్కలుగా నిలిచింది.

నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్... ఓ శక్తిమంతమైన శాస్త్ర విజ్ఞానికుడు మాత్రమే కాదు, మానవ కలల విశ్వ దీప్తి. ఆయన జీవితంలో ప్రతి అడుగు, ప్రతి విజయం మానవ జాతికి ఒక ఆశ, ఒక ఉత్తేజం. చంద్రునిపై వేసిన అడుగుతో ఆయన భూమిపై ఎన్నో తరాలకి దారి తెరిచాడు.

ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై వేసిన అడుగు కేవలం ఒక శాస్త్రీయ ప్రగతికి సంకేతం మాత్రమే కాదు, అది మానవ శక్తి, కలలు, విజ్ఞానం, ప్రగతికి ప్రతీక. ఆయన జీవితం యువతకు ప్రేరణగా నిలుస్తుంది. నిరంతరం శ్రమిస్తూ, శాంతంగా విజయం సాధించిన ఆర్మ్‌స్ట్రాంగ్ చరిత్రలో అక్షరాలా వెలుగుతున్న నక్షత్రంగా నిలిచి పోతారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# భవనాల భద్రత కోసం జైడెక్స్ తీసుకొచ్చిన ఫైర్ రెసిస్టెంట్ మినరల్ పెయింట్ టెక్నాలజీ

హైదరాబాద్, ఆగష్టు 4:భారతదేశంలోని నివాస మరియు వాణిజ్య భవనాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో, 'జైడెక్స్ పెయింట్స్' ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురైన ఒక ప్రమాదంపై దృష్టి సారించింది?అదే గోడలకు వేసే సాంప్రదాయ రంగులు (పెయింట్లు). NCRB గణాంకాల ప్రకారం, మూసివున్న భవనాల్లో జరిగే అగ్నిప్రమాదాల్లో మరణాలకు ప్రధాన కారణం మంటలు కావు, ప్రమాదకరమైన విషపూరిత పొగ మాత్రమే. ప్రస్తుతం ఉపయోగిస్తున్న పెట్రో-పాలిమర్ ఆధారిత ఆక్రిలిక్ మరియు ప్లాస్టిక్-ఎమల్షన్ పెయింట్లు అధిక ఉష్ణోగ్రతల వద్ద కార్బన్ మోనాక్సైడ్ మరియు హైడ్రోజన్ సైనైడ్ వంటి అత్యంత ప్రమాదకరమైన వాయువులను విడుదల చేస్తాయి. దీనివల్ల ప్రజలు సురక్షితంగా బయటపడటానికి సమయం లభించదు. ఈ ప్రమాదాన్ని అధిగమించడానికి జైడెక్స్ 'సిలికేట్ మినరల్ పెయింట్స్'ను పరిచయం చేసింది. పొటాషియం సిలికేట్ మరియు ఖనిజాలతో తయారు చేసిన ఈ 'క్లాస్ 1' గ్రేడ్ ఫైర్-రెసిస్టెంట్ పెయింట్లు అకర్బన (Inorganic) స్వభావం కలిగినవి కావడం వల్ల ఇవి మంటలను వ్యాపింపజేయవు మరియు విషపూరిత పొగను విడుదల చేయవు.వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ వల్ల ఎత్తైన భవనాలు, ఆసుపత్రులు, పాఠశాలలు మరియు ప్రభుత్వ/బహిరంగ ప్రదేశాల్లో సురక్షితమైన నిర్మాణాల అవసరం ఏర్పడింది. ఈ పెయింట్లు కేవలం ఉపరితలంపై ఒక పొరలాగా మాత్రమే కాకుండా సిమెంట్ మరియు ఇటుకల గోడలతో రసాయనికంగా కలిసిపోతాయి. దీనివల్ల పెయింట్ ఊడిపోదు మరియు అగ్నిప్రమాదానికి ఇంధనంగా మారదు. ఈ నూతన సాంకేతికత గురించి జైడెక్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మౌలిక్ రాంకా మాట్లాడుతూ, "భారతదేశంలోని నిర్మాణ రంగం ఇప్పుడు ఒక కీలకమైన దశకు చేరుకుంది. ఇక్కడ అగ్ని భద్రత అనేది కేవలం భవనాల రూపకల్పనకు మాత్రమే పరిమితం కాకూడదు. సాంప్రదాయ పాలిమర్-ఆధారిత పెయింట్లు మంటలు వ్యాపించడానికి మరియు విషపూరిత పొగ ఏర్పడటానికి కారణమవుతాయి. సిలికేట్ మినరల్ పెయింట్లు సంపూర్ణంగా అకర్బన మరియు మంటలు అంటుకోని స్వభావం కలవి. ఈ వ్యవస్థ విషపూరిత పొగను తగ్గించి, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సురక్షితంగా బయటకు రావడానికి అదనపు సమయాన్ని అందిస్తుంది. దీనివల్ల అమూల్యమైన ప్రాణాలను కాపాడటానికి సహాయపడుతుంది" అని తెలిపారు.

# మరహిత గుండె లయ: లయ సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించడం

హైదరాబాద్, ఆగష్టు 4:గుండె లయ లోపాలు తరచుగా పెద్ద ఆరోగ్య సమస్యలతోనే ముడిపడి ఉంటాయని అనుకుంటాం, కానీ కొన్నిసార్లు వాటి ప్రారంభ సంకేతాలు చాలా సూక్ష్మంగా ఉండవచ్చు. ఉదాహరణకు క్రమరహితంగా కొట్టుకోవడం, గుండెలో దడ లేదా క్షణికంగా నాడి వేగమవ్వడం వంటివి. ఈ లక్షణాలు 'అరిథ్మియా' ను సూచించవచ్చు; ఇది గుండె కొట్టుకునే వేగం మరీ ఎక్కువగా, మరీ తక్కువగా లేదా క్రమరహితంగా ఉండే ఒక పరిస్థితి. అన్ని సందర్భాల్లోనూ గుండె లయలో అసాధారణత ప్రమాదకరం కానప్పటికీ, కొత్తగా కనిపించే, నిరంతరం ఉండే లేదా ఆందోళన కలిగించే లక్షణాలను అర్హత కలిగిన ఆరోగ్య సంరక్షణ నిపుణులచే పరీక్షించుకోవాలి.భారతదేశం, ఆగ్నేయాసియా, హాంగ్‌కాంగ్, తైవాన్ మరియు కొరియాలోని అబాట్ కార్డియాక్ రిథమ్ మేనేజ్‌మెంట్ వ్యాపార విభాగానికి జనరల్ మేనేజర్ అయిన అజయ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, "గుండె లయ లోపాలతో జీవిస్తున్న ప్రజలకు అత్యంత ముఖ్యమైనది ఏమిటంటే, వారి జీవితాల్లో సజావుగా ఇమిడిపోయి, వారు త్వరగా సాధారణ స్థితికి తిరిగి రావడానికి సహాయపడే సకాల, సమర్థవంతమైన సంరక్షణ ఇది. అబాట్‌లో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను ఉపయోగించే పర్యవేక్షణ ద్వారా ముందస్తుగా గుర్తించడాన్ని సాధ్యం చేయడం నుండి, బ్రాడీకార్డియా రుగ్మతలకు చికిత్స అందించే అధునాతన సంరక్షణను రోగులకు అందించడంలో సహాయపడటం వరకు, ఈ ప్రయాణాన్ని సులభతరం చేయడమే మా లక్ష్యం.లీడ్‌లెస్ పేస్‌మేకర్‌ల వంటి ఆవిష్కరణలు, లీడ్ సంబంధిత మరియు ఇన్ఫెక్షన్ సమస్యలను తగ్గించడంతో పాటు, వేగవంతమైన కోలుకోవడానికి మరియు అధిక సౌకర్యానికి దోహదపడేలా రూపొందించబడ్డాయి.

అవగాహన, రోగనిర్ధారణ పెరుగుతున్న కొద్దీ..ఈ అధునాతన చికిత్సలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంపై మేము దృష్టి సారిస్తున్నాం. కేవలం వైద్యపరంగానే కాకుండా, నిజంగా రోగుల సంక్షేమానికే ప్రాధాన్యమిచ్చే సంరక్షణను అందించడానికి వైద్యులతో కలిసి పనిచేస్తున్నాం."డాక్టర్ ఎం. ఎస్. చంద్రమౌళి, సీనియర్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ - కార్డియాలజీ, యశోద హాస్పిటల్స్, హైదరాబాద్.: "ప్రతి సంవత్సరం, గుండె లయకు సంబంధించిన సమస్యలను నియంత్రించుకోవడానికి చాలా మంది పేస్‌మేకర్లపై ఆధారపడుతుంటారు. సాంప్రదాయ పరికరాలు సమర్థవంతమైనవే అయినప్పటికీ, లీడ్‌లెస్ పేస్‌మేకర్‌లు కనిపించే మచ్చలు లేకుండా మరియు ప్రక్రియ సంబంధిత ప్రమాదాలు తక్కువగా ఉండే, తక్కువ హానికరమైన ఎంపికను అందిస్తాయి. సరైన రోగుల విషయంలో, దీనివల్ల వేగంగా కోలుకోవడం, మరింత సౌకర్యం ఉండి దైనందిన జీవితానికి త్వరగా తిరిగి రావడానికి సాధ్యమవుతుంది."ఎక్కువ మంది తమ జీవనశైలికి తగిన చికిత్సలను కోరుకుంటున్నారు.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం..జూరాల నుంచి 2.09 లక్షల క్యూసెక్కుల వరద రాక

అమరావతి, ఆగష్టు 4:మహారాష్ట్ర, కర్ణాటక నుంచి జూరాల కు వరద కొనసాగుతుండడంతో నారాయణపూర్ డ్యామ్ నుంచి దిగువకు కృష్ణమ్మ పరుగులు పెడుతున్నది. అక్కడి నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు మంగళవారం జూరాల ప్రాజెక్టు 27 గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేయడంతో నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి జూరాల నుంచి 2.09 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుంది.

శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 859.3 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. పూర్తిస్థాయి నీటినిల్వ 215.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 103.8 టీఎంసీల వరకు నీరు నిలువ ఉంది. కర్ణాటకలో భారీ వర్షాలతో కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు వరద కళ వచ్చింది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర, జూరాల, శ్రీశైలానికి వరద ప్రవాహం కొనసాగుతుంది.

# రూ.61.99 కోట్ల వ్యయంతో ప్రసాద్ పథకం



ములుగు, ఆగష్టు 4: (నేటినిజం ప్రతినిధి)వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయం వద్ద ప్రసాద్ పథకం రూ.61.99 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువులోగా నాణ్యత ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం డి ఈ నటరాజ్, ఏఈ విజయ్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కీర్తి శేషులు పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన వరంగల్ ఉమ్మడి జిల్లా తెలుగు యువత



ములుగు, ఆగష్టు 4: (నేటినిజం ప్రతినిధి)ఈరోజు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే గౌరవనీయులు కీర్తి శేషులు పెద్ది సుదర్శన్ రెడ్డి అన్న గారి 5 రోజుల కార్యక్రమంలో నల్లబెల్లి మండల కేంద్రం లో వారి స్వగృహంలో తెలుగు యువత వరంగల్ ఉమ్మడి జిల్లా తరపునా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొంగర ప్రభాకర్ టీడీపీ బిఞ సెల్ రాష్ట్ర కార్యదర్శి బైరపాక ప్రభాకర్ పాల్గొన్నారు

# రూ.230 లక్షల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం




ములుగు, ఆగష్టు 4: (నేటినిజం ప్రతినిధి)వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రూ.230 లక్షల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం, అదనపు తరగతి గదులు, ప్రయోగశాల భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి,

పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి,డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, డి ఈ అరుణ్ కుమార్, ప్రత్యేక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షోభంలోకి వ్యవసాయ రంగం'

## -ముఖ్య నాయకులతో కలిసి ఆర్డీఓకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వినతి



నల్గొండ, ఆగష్టు 4:రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని, ఎన్నికల్లో రైతులకు అండగా ఉంటామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతులను దగా చేస్తుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ముఖ్య నాయకులతో కలిసి ఆర్డీఓ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట సాగు ప్రారంభ దశలో రైతులకు అవసరమైన క్రాప్ లోన్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. గతంలో ప్రతి ఏడాది రైతులు పంట రుణాలను సులభంగా రెన్యువల్ చేసుకునేవారని ప్రస్తుతం బ్యాంకులో పాత రుణ మొత్తం అసలు, వడ్డీతో సహా చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని రైతులను తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. బ్యాంకులపై ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడం వల్ల రైతులు మళ్లీ ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.

ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకోలేదని, లో వోల్టేజీతో మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, సకాలంలో నీరందకపోతే పంటలు ఎండిపోవడం ఖాయమని ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా ఎరువుల రవాణాకిచ్చే ప్రైవేట్ ఆన్ లారీ (ఎఫ్ ఓ ఎల్) రాయితీని ప్రభుత్వం రద్దు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ నిర్ణయంతో పీఏసీఎస్‌లు, డీలర్లు అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తుందని ఈ భారం రైతుల పైనే పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎరువుల కొరత ఏర్పడి బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సిరెడ్డి, ఎస్.కె నయీమ్, చీమ నరేష్, కె.బాబు, తుమ్మలపల్లి భాస్కర్, ఉపేందర్ గౌడ్, గొర్రె రాజేష్, చీమ శ్రీనివాస్, గట్ల కోటేశ్వరరావు, కరీముల్లా, బాబా, చలిగంటి వెంకట్, మండల పార్టీ బాధ్యులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్‌లో చోరీ సొత్తుతో నిందితుడి అరెస్ట్..

## -రూ.1.85 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం..



అమరావతి, ఆగష్టు 4:విజయవాడ రైల్వే స్టేషన్‌లో సాధారణ తనిఖీల సందర్భంగా చోరీ సొత్తుతో తిరుగుతున్న ఒడిశాకు చెందిన వ్యక్తిని ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.1.85 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రైల్వే ఐజీపీ బి. రాజకుమారి ఆదేశాలు, విజయవాడ రైల్వే జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ సూచనల మేరకు డీఎస్పీ ఆర్.జీ. జయసూర్య పర్యవేక్షణలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సంయుక్తంగా విజయవాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫాం నంబర్-7 మధ్య వంతెన సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన దులామని సాగర్ (29)ను అదుపులోకి తీసుకుని అతని బ్యాగ్‌ను తనిఖీ చేశారు.అందులో 16 గ్రాముల బంగారు గొలుసు, ఒక జత వెండి పట్టీలు, వెండి ఉంగరం, రెడ్‌మీ, వివో కంపెనీలకు చెందిన రెండు మొబైల్ ఫోన్లు లభించాయి.పరిశీలనలో ఇవి జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు సంబంధించిన చోరీ సొత్తుగా గుర్తించారు. మొత్తం రూ.1.85 లక్షల విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె.వి. రమణతో పాటు జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.